పేదల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావడమే సీఎం చంద్రబాబు లక్ష్యం. ఏటా రూ.33 వేల కోట్లతో 28 కేటగిరీలకు పెన్షన్లు అందిస్తున్నారు. ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించే నాయకుడిగా నిలిచారు.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ




శుక్రవారం 17.07.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 86 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

# భవిష్యత్తు అంతా వీజీఎఫ్‌దే

- పీపీపీ ప్రాజెక్టులతో వేగవంతమైన అభివృద్ధి సాధ్యమన్న సీఎం
- ప్రతి శాఖకు ప్రత్యేక ఫైనాన్షియల్ ప్లాన్‌కు ఆదేశాలు
- ప్రభుత్వ ఆస్తుల సద్వినియోగంపై దృష్టి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** భవిష్యత్తులో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌తో కూడిన ప్రాజెక్టులే కీలకంగా మారనున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గతంలో ఆర్థిక సంస్కరణలు, ప్రస్తుతం మౌలిక సదుపాయాల విప్లవం దేశంలో నడుస్తోందని అన్నారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతోనే వివిధ రంగాల్లో ప్రాజెక్టులు చేపట్టి వేగంగా అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుందని సీఎం అన్నారు. రాష్ట్రంలో పీపీపీ కింద చేపట్టిన ప్రాజెక్టులు, ప్రభుత్వం చేస్తున్న వ్యయం తదితర అంశాలపై గురువారం ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం పోర్టులు, షిప్ యార్డులు, ఎయిర్ పోర్టులు, పర్యాటక ప్రాజెక్టులు సహా మొత్తం 260 ప్రాజెక్టులను పీపీపీ కింద చేపట్టినట్టు ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పరిశ్రమలు, మౌలికసదుపాయాలు, పురపాలక, టూరిజం, వైద్య కళాశాలలు, రహదారులు, సౌర విద్యుత్ లాంటి రంగాల్లో రూ.1,23,229 కోట్ల విలువైన ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం అన్ని పీపీపీ ప్రాజెక్టులనూ సస్టెయినబుల్ మోడల్‌లో అభివృద్ధి చేయాలని... ప్రతీ ప్రాజెక్టు వద్దా ఆర్థిక కార్యకలాపాలకు అవకాశం ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. వివిధ ప్రాజెక్టులకు కేంద్రం ఇచ్చే అర్బన్ ఛాలెంజ్ ఫండ్ లాంటి వాటిని కూడా సమర్ధంగా వినియోగించుకోవాలని అన్నారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను సమర్ధంగా నడిపేందుకు అవసరమైన మెకానిజమ్ సిద్ధం చేయాలని సూచించారు. కోస్టల్ టూరిజం ప్రాజెక్టుల్లో స్థానిక మత్స్యకారులను కూడా భాగస్వాములను చేసి వారికి ప్రయోజనాలు కలిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 21 ప్రధాన దేవాలయాల వద్ద పబ్లిక్ టచ్ పాయింట్ల వద్ద మెరుగైన మౌలిక సదుపాయాలు, ఆర్థిక కార్యకలాపాలకు అవకాశాలు కల్పించాలన్నారు. విజయవాడ, తిరుపతిలోని వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు రూ.178 కోట్ల వీజీఎఫ్‌ను కేంద్రం ఇస్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మెడికల్ కాలేజీలకు రూ.1,468 కోట్ల వీజీఎఫ్ రానుందని.. ఈ ప్రాజెక్టులు చేపట్టిన విధానంపై కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం ప్రశంసించిందని అధికారులు తెలిపారు.

**వచ్చే కేబినెట్‌కు నూతన విధానం :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం-వీజీఎఫ్ పాలసీ 1.0 ను వచ్చే కేబినెట్ సమావేశంలో చర్చకు పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మిగతా 2లో...

## నేతన్నకు రూ.25 వేల భరోసా

- ఆగస్టు 7న చేనేత కార్మికుల ఖాతాల్లో జమ
- రాష్ట్రవ్యాప్తంగా 55 వేల మందికి లబ్ధి
- పథకం అమలుకు రూ.250 కోట్ల కేటాయింపు

2 లో

## ఆధ్యాత్మికతే ఒత్తిడి తగ్గించే మంత్రం

- జగన్నాథ రథయాత్రలో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు
- సమాజ శాంతికి దేవాలయాలు కీలకమన్న ముఖ్యమంత్రి
- అమరావతిని విశ్వనగరిగా తీర్చిదిద్దాలని ఆకాంక్ష

2 లో

## సెప్టెంబరులో స్థానిక పోరు..!

- ముందుగా మున్సిపల్ ఎన్నికలకు సన్నాహాలు
- ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, పంచాయతీ ఎన్నికలు
- పార్టీ శ్రేణులకు ఇంటింటి ప్రచారంపై సీఎం దిశానిర్దేశం

2 లో

## 22న 'తల్లికి వందనం' జమ

- 67.47 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి
- రూ.10,120 కోట్ల విడుదలకు ప్రభుత్వం ఉత్తర్వులు
- తొలి విడతలో 64.76 లక్షల ఖాతాల్లో నగదు జమ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** 'తల్లికి వందనం' పథకం లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 2026-27 విద్యాసంవత్సరానికి ఈ పథకాన్ని అమలు చేస్తూ ఈ నెల 22న అర్హులైన విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయనున్నట్లు ప్రకటించింది. ఒకటి నుంచి ఇంటర్ వరకు చదివే ప్రతి విద్యార్థికి రూ.15 వేలలో, తల్లి ఖాతాకు రూ.13,000, పాఠశాల అభివృద్ధికి రూ.2,000 చొప్పున జమ చేయనున్నారు. ఇందుకోసం రూ.10,120.78 కోట్ల విడుదలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 67,47,190 మంది విద్యార్థులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనుండగా, తొలి విడతలో 64,76,590 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఈ నెల 22నే నగదు జమ కానుంది. మిగతా 2లో...

## పవన్‌కు గవర్నర్ పరామర్శ



- హైదరాబాద్ నివాసానికి వెళ్లి ఆరోగ్యంపై విచారణ
- వైద్యుల సూచనలు పాటించాలని సూచించిన నజీర్
- లైబ్రరీలో పుస్తకాలను పరిశీలించి చర్చ

**హైదరాబాద్(జర్నలిస్ట్ ఫైల్) :** కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పరామర్శించారు. మిగతా 2లో...

## పోలవరం-మోదీ వరం

- 'జై పోలవరం.. జై జై ప్రధాని మోదీ'తో హోరెత్తిన బీజేపీ మాధవ్
- పోలవరం ప్రాజెక్టు వద్ద బీజేపీ అగ్రనేతల భారీ ర్యాలీ
- నిర్మాణ పురోగతి, పునరావాసం, పర్యాటకాభివృద్ధిపై అధికారులతో విస్తృత చర్చ
- 'మోదీ సంకల్పం-చంద్రబాబు కార్యాచరణ'తో వేగంగా పోలవరం పూర్తి : బీజేపీ మాధవ్

**పోలవరం (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన పోలవరం జాతీయ ప్రాజెక్టు త్వరితగతిన పూర్తై రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాదిగా నిలవాలనే సంకల్పంతో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నేతృత్వంలో గురువారం రాజమహేంద్రవరం నుంచి పోలవరం ప్రాజెక్టు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ప్రారంభానికి ముందు మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజపేయి కాంస్య విగ్రహానికి కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, బీజేపీ శాసనమండలి పక్ష నేత సోము వీర్రాజు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కలిసి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. మిగతా 3లో...



## అమరరాజాకు ఏపీ క్షమాపణ

గత ప్రభుత్వ వేధింపులు ఉండకూడదు..

అమరరాజాకు రాష్ట్ర తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి

రాష్ట్ర మంత్రి నారా లోకేశ్

## పర్యాటకంలో స్వర్ణాంధ్రకు దిక్సూచి

- 'స్వర్ణాంధ్ర పర్యాటక విజన్-2047'ను వివరించిన మంత్రి దుర్గేష్
- దేశంలోనే అగ్రగామి పర్యాటక రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ఫెయిత్ కాన్‌క్లేవ్‌లో ఏపీ సామర్థ్యాల ప్రదర్శన

3 లో




మరిన్ని కథనాలు లోపలి పేజీల్లో

### గ్లోబల్ ఫుడ్ హబ్‌గా ఏపీ

- ఆహార ప్రాసెసింగ్‌లో దేశానికే దిక్సూచిగా రాష్ట్రం
- రూ.30 వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యం
- ఫుడ్ వరల్డ్ ఇండియా సదస్సులో మంత్రి టీజీ భరత్ వెల్లడి

### హాస్టళ్లలో నాణ్యతే ప్రామాణికం

- పరిశుభ్రత, మెనూ అమలులో రాజీపడొద్దని మంత్రి సూచన
- విద్యార్థులకు అన్ని సౌకర్యాల కల్పనపై దృష్టి
- జూమ్ సమావేశంలో అధికారులకు దిశానిర్దేశం

### అందరికీ విద్యుత్ సబ్సిడీ..

- ఆక్వా రైతులకు మళ్లీ విద్యుత్ భరోసా
- జగన్ విభజనకు చెక్.. సబ్సిడీకి గ్రీన్ సిగ్నల్


## భోగాపురం ఎయిర్‌పోర్టుకు గ్రీన్‌సిగ్నల్

- మరో నెలలో ప్రారంభానికి కేంద్రం కసరత్తు
- ప్రధాని మోదీ ప్రారంభించే అవకాశం
- పర్యాటకం, పరిశ్రమలకు కొత్త ఊపు



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల అయిన భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం మరో నెల రోజుల్లో సేవలు ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు గురువారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఉడాన్-2.0 పథకంపై నిర్వహించిన వర్క్‌షాప్ అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, విమానాశ్రయ నిర్మాణ పనులు పూర్తయ్యాయని, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నుంచి అవసరమైన అనుమతులు కూడా లభించాయని తెలిపారు. ఉత్తరాంధ్రతో పాటు రాష్ట్రానికే ప్రతిష్ఠాత్మకమైన ఈ విమానాశ్రయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభించేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తోందని, ప్రధాని పర్యటన తేదీ ఖరారైన వెంటనే ప్రారంభోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. సుమారు రూ.4,750 కోట్ల వ్యయంతో 2,203 ఎకరాల్లో నిర్మించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం అత్యాధునిక అంతర్జాతీయ ప్రమాణాలతో రూపుదిద్దుకుంది. 3,800 మీటర్ల పొడవు, 45 మీటర్ల వెడల్పుతో నిర్మించిన రన్‌వేపై బోయింగ్, ఎయిర్‌బస్ వంటి భారీ విమానాలు సులభంగా ల్యాండ్ అయ్యేలా ఏర్పాట్లు చేశారు. మిగతా 2లో...

## స్థానికులకే 95% ఉద్యోగాలు

- రాష్ట్రపతి ఉత్తర్వులు-2025 అమలుకు శ్రీకారం
- ఆరు జోన్లు, రెండు మల్టీ జోన్లుగా రాష్ట్ర విభజన
- ఆగస్టు 5లోపు క్యాడర్ పునర్వ్యవస్థీకరణ పూర్తి లక్ష్యం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, స్థానిక క్యాడర్ల వ్యవస్థీకరణలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. కేంద్రం జారీ చేసిన 'రాష్ట్రపతి ఉత్తర్వులు-2025' అమలుకు శ్రీకారం చుడుతూ మిగతా 3లో...

## అమరావతి పూర్తయితే లక్ష కోట్ల ఆదాయం



- 175 నియోజకవర్గాల అభివృద్ధికి ఆస్కారం
- రాజధాని సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్
- స్థిరం లేని గొడ్డలి పార్టీ నేత మాటలు నమ్మొద్దు
- మంత్రి నిమ్మల రామానాయుడు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ స్థాయి ప్రమాణాలతో రూపుదిద్దుకొంటున్న అమరావతి రాజధాని నగరం పూర్తయితే లక్ష కోట్ల రూపాయల ఆదాయం ఇస్తుందని, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. గురువారం ఆయన మున్సిపల్, పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావులతో కలసి అమరావతిలో రూపు దాల్చిన ఐకానిక్ భవనాలను, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్వార్టర్లను, అఖిల భారత సర్వీస్ ఉద్యోగుల క్వార్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి నారాయణ, శ్రీనివాస రావులతో కలిపి మీడియాతో మాట్లాడారు.

అమరావతిపై గొడ్డలి పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి, ఆ పార్టీ ఇతర నేతలు చేస్తున్న విష ప్రచారాన్ని మిగతా 3లో...

## నేతన్నకు రూ.25 వేల భరోసా

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చేనేత కార్మికులకు అదిరిపోయే శుభవార్త అందింది. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆగస్టు 7వ తేదీన నేతన్నకు భరోసా స్కీం అమలు చేసేందుకు రంగం సిద్ధం చేసింది సర్కార్. ఈ మేరకు కసరత్తులు కూడా ప్రారంభించింది చేనేత, జౌళి శాఖ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 55,000 మంది అర్హులు ఉంటారని... వారందరికీ ఏడాదికి రూ.25 వేల చొప్పున నేతన్నకు భరోసా పథకం కింద ఆర్థిక సహాయాన్ని అందించనున్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ఈ పథకం కింద రూ.24000 ఇచ్చేవారు. అయితే ఇప్పుడు మరో వెయ్యి అదనంగా కార్మికులకు ఇచ్చేందుకు సీఎం చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారు. ఈ పథకం అమలు కోసం బడ్జెట్ లో రూ.250 కోట్లు కూడా కేటాయించింది సర్కార్.

**నేతన్నకు భరోసా పథకానికి ఎవరు అర్హులు ? :** సొంత మగ్గం ఉండే చేనేత కార్మికులకు నేతన్నకు భరోసా పథకం వర్తించనుంది. కుటుంబంలో ఒకరికి మాత్రమే ఆర్థిక సహాయం అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. రాట్నం వడకడం, రంగులు అద్దడం లాంటి కార్మికులకు కూడా ఈ పథకం వర్తించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ రంగాలకు సంబంధించిన వాళ్ళు దాదాపు పదివేల మంది ఉంటారని ఓ అంచనాకు కూడా వచ్చింది సర్కార్.

## పవన్‌కు గవర్నర్ పరామర్శ



(మొదటి పేజీ తరువాయి)

శస్త్రచికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న గవర్నర్, వైద్య నిపుణుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు.

**పవన్ లైబ్రరీని సందర్శించిన గవర్నర్ :** ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ నివాసంలోని వ్యక్తిగత లైబ్రరీని జస్టిస్ అబ్దుల్ నజీర్ సందర్శించారు. అక్కడ ఉన్న ప్రఖ్యాత రచయితలు, స్కాలర్లు, విశ్లేషకులు, ప్రజా విధాన రూపకర్తలు రచించిన పలు పుస్తకాలను పరిశీలించారు. వాటి అంశాలపై పవన్ కల్యాణ్‌తో ఆసక్తిగా చర్చించారు. పవన్ కల్యాణ్ అభ్యర్థన మేరకు ఒక పుస్తకంపై గవర్నర్ తన ఆటోగ్రాఫ్ కూడా చేశారు. గవర్నర్ స్వయంగా నివాసానికి వచ్చి పరామర్శించడం పట్ల పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు.

## హాస్టళ్లలో నాణ్యతే ప్రామాణికం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, మెనూ అమలులో రాజీ పడొద్దని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అధికారుల్ని ఆదేశించారు. గురువారం తాడేపల్లిలోని సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టరేట్ లో సాంఘిక సంక్షేమ శాఖ డీడీలు, డీసీవోలు, ఏఎస్ డబ్ల్యూవోలతో మంత్రి డిఎస్ బీవీ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షేమ హాస్టళ్ల పనితీరుపై నిరంతరం సమీక్షిస్తున్నారు. హాస్టళ్లలో పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, మెనూ అమలులో రాజీ పడొద్దు. హాస్టళ్లలో పారిశుధ్య నిర్వహణ, సౌకర్యాల కల్పనపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో 100 శాతం సంతృప్తి రావాలి. విద్యార్థులతో ప్రిన్సిపాళ్లు, వార్డెన్లు ప్రేమ, ఆప్యాయతగా మెలగాలి. ఎక్కడా చిన్న సమస్య కూడా రానీయెద్దు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై నిరంతరం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఔట్ సోర్సింగ్ ఏజెన్సీతో శానిటేషన్ సిబ్బందిని నియమించాం. అన్ని హాస్టళ్లలో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశాం. 10 శాతం డైట్ చార్జీలు పెంచాం, విద్యార్థులకు నైట్ డ్రెస్, బెడ్, మస్కిటో మెస్ లు, టవళ్లు అన్నీ ఇస్తున్నాం. విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం.ఎం నాయక్ , డైరెక్టర్ బి. లావణ్య వేణి, ప్రాూాబె=జు×ూ కార్యదర్శి వి. ప్రసన్న వెంకటేష్, సాంఘిక సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ సునీల్ రాజ్ కుమార్, అన్ని జిల్లాల డీడీలు, డీసీవోలు, ఏ ఎస్ డబ్ల్యూవోలు పాల్గొన్నారు.

## నేడు బ్రహ్మంగారి మఠంకు రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మెన్ రాక



**బ్రహ్మంగారి మఠం (జర్నలిస్ట్ ఫైల్ )** బ్రహ్మంగారిమఠం మండలంలోని మూడమాల గుండాపురం గ్రామాలకు చెందిన ఓబులేష్ సతీష్ వివాదాస్పద రీతిలో ఫిబ్రవరి మాసం లో మరణించిన నేపథ్యంలో ఆ విషయం పై ఇంకా ఎటువంటి సమాచారం లేని నేపథ్యంలో రాష్ట్ర దళిత సంఘాల నేతలు ఎమ్మార్పీఎస్ ఎంఈఎఫ్ ఎంఎస్పి నాయకులు ఆధ్వర్యంలో రాష్ట్ర ఎస్సీ కమిషనర్ జవహర్ ను కలిసి బాధ్యత దళిత కుటుంబాలకు న్యాయం చేయాలని హత్య వెనక ఉన్న నేపథ్యాన్ని నిగ్గు తేల్చి నిజా నిజాలు వెలికి తీసి బాధ్యత కుటుంబాలకు న్యాయం చేకూర్చాలని దళిత సంఘాల కోరగా వారి విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ శుక్రవారం నాడు బ్రహ్మంగారిమఠంకు రానున్నట్లు దళిత ప్రజా సంఘాలు తెలియజేశాయి.

# భవిష్యత్తు అంతా వీజీఎఫ్‌దే

(మొదటి పేజీ తరువాయి)

దీనికి సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలు విడుదల చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వేర్వేరు విధానాలను కూడా అధ్యయనం చేయాల్సిందిగా సూచించారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాల మేరకు ప్రతీ ఏటా పీపీపీ కింద రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. రాష్ట్రంలోని విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లలో పెద్దఎత్తున మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కింద వీటిని చేపట్టాల్సి రావొచ్చని సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం స్వర్ణాంధ్ర విజన్ మైక్రో, మ్యాక్రో లక్ష్యాలకు అనుగుణంగా ప్రాజెక్టులు చేపట్టాలని అన్నారు. ఎప్పటికప్పుడు లోటుపాట్లను సరిదిద్దుకుంటూ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. భవిష్యత్తులో పరిశ్రమలకు సరఫరా చేసే నీటి ద్వారా జలవనరుల శాఖకు ఆదాయం వస్తుందని... సాగునీటి సంఘాలు కూడా ఈ ప్రక్రియలో కీలకంగా ఉంటాయన్నారు. ప్రతీ ప్రభుత్వ శాఖ ఫైనాన్షియల్ ప్లాన్ ను తయారు చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికల ద్వారా ఆదాయ మార్గాలను నిర్దేశించుకోవాలన్నారు. ప్రభుత్వ శాఖలు పెట్టుబడిదారుల నుంచి విశ్వాసాన్ని కలిగించేలా



పీపీపీ ప్రాజెక్టులను చేపట్టాలని సీఎం సూచించారు. ఏ రంగమైనా ఏపీకి ఫస్ట్ మూవర్ అడ్వాంటేజి రావాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

**ప్రభుత్వ ఆస్తుల సద్వినియోగం :** ప్రభుత్వం వద్ద నిరర్ధకంగా ఉన్న ఆస్తులను అవకాశాలుగా మలచుకోవాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని అన్ని బస్టాండ్ల వద్ద ప్రభుత్వానికి ఉన్న భూములను వాణిజ్య పరంగా వినియోగించుకునే అవకాశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పంప్డ్ స్టోరేజీ, సౌరవిద్యుత్ ప్రాజెక్టులు కూడా పీపీపీ కింద చేపట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గనులు, నెడ్ క్యాప్, పర్యాటకం, లాజిస్టిక్స్ రంగాల్లో భారీగా ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉందని సీఎం అన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ హాస్టళ్లలో ఉన్న విద్యార్థుల సంఖ్యను రెట్టింపు చేసేందుకు ఆలోచన చేస్తున్నామని.. పట్టణ ప్రాంతాల్లో రహదారులకు సమీపంలోనే మినీ టౌన్‌షిప్‌లా రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సీఎం సూచించారు. బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులను నైపుణ్యం ఉన్న మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోందని సీఎం స్పష్టం చేశారు. ఐఐటీ, ఐఐఎం లాంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లోనూ చదివేలా వీరిని తీర్చి దిద్దాలని అన్నారు. ఈ సమీక్షకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆ శాఖ ఉన్నతాధికారులు పీయూష్ కుమార్, వి.వినయ్ చంద్, రోనాల్డ్ రోస్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, ఐఅండ్ ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు తదితరులు హాజరయ్యారు.

# ఆధ్యాత్మికతే ఒత్తిడి తగ్గించే మంత్రం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రోజువారీ జీవితంలో ఒత్తిడి తగ్గించే అత్యుత్తమ మంత్రం ఆధ్యాత్మికత ఒక్కటేనని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. సమాజాన్ని ప్రశాంతంగా ఉంచే క్షేత్రాలు మన దేవాలయాలని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. సమాజంలో మానవ సంబంధాలు తగ్గి సామాజిక మాధ్యమాల ప్రతికూల ప్రభావం పడుతోందని ఆయన అన్నారు. ఈ కారణంగా కొన్ని కుటుంబాల్లో ఆత్మహత్యలు, చిన్నారులపై అఘాయిత్యాల లాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని వ్యాఖ్యానించారు. అందరి జీవితాల్లో ఒత్తిడి దూరమై మానసిక ప్రశాంతత చేకూరేందుకు ఆధ్యాత్మికతే మార్గమని ఆయన వివరించారు. అందుకే రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాలు నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. అమరావతి రాజధానిలోని వెంకటపాలెం నుంచి ఆయన జగన్నాథుడి రథయాత్రను ముఖ్యమంత్రి ప్రారంభించారు. పూరీ క్షేత్రంలో నిర్వహించే సంప్రదాయ క్రతువులను అనుసరిస్తూ జగన్నాథ, బలభద్ర, సుభద్రలతో కూడిన రథం ముందు సీఎం బంగారు చీపురుతో ఊడ్చి శుభ్రం చేసి స్వామివారి రథ యాత్రను తాడుతో లాగి ప్రారంభించారు. అమరావతి రాజధాని నగర




బృహత్ ప్రణాళికతో కూడిన చిత్ర పటాన్ని శిరస్సుపై ధరించి విశ్వ నగరిగా అమరావతి ఎదగాలని ముఖ్యమంత్రి జగన్నాథ స్వామిని కోరుకున్నారు. అంతకు ముందు అక్కడే ఏర్పాటు చేసిన రథయాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని సీఎం ప్రసంగించారు. భారతీయ సంస్కృతిలో భాగమైన ఉమ్మడి కుటుంబాలు రావాలని మైక్రో ఫ్యామిలీలు కాదని సీఎం అన్నారు. పూరీ క్షేత్రంలో నిర్వహించే జగన్నాథ రథ యాత్రకు ఎంతో ప్రత్యేకత ఉందని.. అలాంటి రథ యాత్రను అమరావతిలో తొలిసారి నిర్వహించటంపై సీఎం సంతోషం వ్యక్తం చేశారు. ప్రతీ ఏటా జగన్నాథ రథ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఇస్కాన్ సంస్థ ప్రకటించిందని అన్నారు. ఆధ్యాత్మికత, ప్రజా సేవలో ఇస్కాన్, అక్షయపాత్ర ఫౌండేషన్ లు పనిచేస్తున్నాయని తెలిపారు. దేశంలోని 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో 25 వేల పాఠశాలల్లో ఆహారం అందిస్తున్నాయన్నారు. ఏపీలోని 10 సెంట్రలైజ్డ్ కిచెన్ల ద్వారా 1.80 లక్షల మంది విద్యార్థులకు అక్షయపాత్ర ఫౌండేషన్ ఆహారం అందిస్తోందన్నారు. భారతీయ సంస్కృతిని కాపాడేందుకు ఇస్కాన్ లాంటి సంస్థలతో కలిసి పని చేస్తామన్నారు. జగన్నాథ రథ యాత్ర కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి పి.నారాయణ, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రవణ్ కుమార్ తదితర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

# పర్యాటకంలో స్వర్ణాంధ్రకు దిక్సూచి

**న్యూఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన పర్యాటక రాష్ట్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. న్యూఢిల్లీలో జరిగిన ప్రతిష్ఠాత్మక ఫెయిత్ టూరిజం కాన్‌క్లేవ్-2026లో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రూపొందించిన 'స్వర్ణాంధ్ర పర్యాటక విజన్-2047' ద్వారా రాష్ట్రాన్ని అంతర్జాతీయ పర్యాటక పటంలో అగ్రగామిగా నిలబెట్టనున్నట్లు వెల్లడించారు. "భారతదేశంలోని అన్ని అద్భుతాలు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నాయి" అంటూ రాష్ట్ర పర్యాటక వైవిధ్యాన్ని జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులకు వివరించారు.

రాష్ట్రంలో 1,054 కిలోమీటర్ల సముద్ర తీరం, 283 బీచ్‌లు, తిరుమలతో పాటు 80 వేలకుపైగా ఆలయాలు, 13 వన్యప్రాణి



సంరక్షణ కేంద్రాలు, మూడు జాతీయ పార్కులు, అతిపెద్ద టైగర్ రిజర్వ్, బౌద్ధ, వారసత్వ, ఎకో, అడ్వెంచర్ టూరిజం గమ్యస్థానాలతో ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిందని మంత్రి చెప్పారు. గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో 2023-24లో 28.58 కోట్లుగా ఉన్న పర్యాటకుల సంఖ్య 2025-26 నాటికి 36.42 కోట్లకు పెరిగిందని, విదేశీ పర్యాటకుల రాక కూడా రికార్డు స్థాయిలో 48.63 శాతం వృద్ధి నమోదు చేసిందని వెల్లడించారు.

పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించి 2024-29 పర్యాటక విధానం అమలు చేస్తున్నామని, ఇప్పటికే రూ.19,693 కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని మంత్రి తెలిపారు. హోటళ్లు, హోమ్‌స్టేలు, క్యారవాన్ పార్కులు, అడ్వెంచర్ టూరిజం, బీచ్ షాక్స్, ఫిల్మ్ టూరిజం, రివర్ క్రూయిజ్‌లు, సీప్లేన్ సేవలు వంటి పలు రంగాల్లో భారీ అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. "ఆంధ్రప్రదేశ్ కేవలం చూడదగిన ప్రదేశం కాదు.. అది సంపూర్ణ జీవన అనుభూతి. పెట్టుబడిదారులు రాష్ట్రానికి వచ్చి భాగస్వామ్యాలు నెలకొల్పి పర్యాటక రంగ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి. మీతో కలిసి ప్రయాణించేందుకు ఏపీ టూరిజం సిద్ధంగా ఉంది" అంటూ మంత్రి కందుల దుర్గేష్ ఇన్వెస్టర్లకు ఆహ్వానం పలికారు.

# గ్లోబల్ ఫుడ్ హబ్‌గా ఏపీ

**న్యూఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ ఆహార ప్రాసెసింగ్ రంగంలో ఆంధ్రప్రదేశ్ వేగంగా గ్లోబల్ హబ్‌గా ఎదుగుతోందని రాష్ట్ర భారీ పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్ అన్నారు. న్యూఢిల్లీలో ఫిక్కీ, డెలాయిట్ సంయుక్తంగా నిర్వహించిన 17వ ఫుడ్ వరల్డ్ ఇండియా-2026 జాతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ ఆహార ప్రాసెసింగ్ రంగం 8.1 ట్రిలియన్ డాలర్ల మార్కెట్‌గా ఉండగా, భారతదేశం వాటా 543 బిలియన్ డాలర్లు, అందులో ఆంధ్రప్రదేశ్ ఒక్కటే 49 బిలియన్ డాలర్ల (సుమారు 9 శాతం) వాటాతో దేశంలోనే అత్యధిక రిజిస్టర్డ్ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు కలిగిన రాష్ట్రంగా నిలిచిందన్నారు. చేపలు, రొయ్యల ఉత్పత్తి, ఎగుమతులు, మిర్చి, నిమ్మ, కోకో, ఆయిల్‌పామ్, బొప్పాయి, గుడ్ల ఉత్పత్తిలో రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉందని తెలిపారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రైతులకు విలువ ఆధారిత ప్రాసెసింగ్ పరిశ్రమలను చేరువ చేసి గ్రామీణ




ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని మంత్రి చెప్పారు. "భారత్ ప్రపంచానికి ఆహారం అందిస్తే... దానిని ప్రాసెస్ చేయడానికి ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉంది" అని పేర్కొంటూ, రాష్ట్రం ఇకపై కేవలం వ్యవసాయ ఉత్పత్తులకే పరిమితం కాకుండా ప్రపంచ ఫుడ్ ప్రాసెసింగ్ బ్రాండ్‌గా ఎదుగుతుందని అన్నారు. పెట్టుబడిదారులకు సింగిల్ డెస్క్ అనుమతులు, వేగవంతమైన నిర్ణయాలు, ప్రత్యేక ప్రాజెక్టు హ్యాండ్‌హోల్డింగ్ ద్వారా 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' కంటే 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లిలికు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని వివరించారు.

ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో రూ.30,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించి మూడు లక్షల ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని టీజీ భరత్ వెల్లడించారు. రాష్ట్రంలో 1,000 కిలోమీటర్ల సముద్ర తీరం, ఆరు పోర్టులు, ఏడు విమానాశ్రయాలు, తొమ్మిది ప్లగ్-అండ్-ప్లే ఫుడ్ పార్కులు, భారీ కోల్డ్ స్టోరేజ్, వేర్‌హౌసింగ్ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గత రెండేళ్లలో రూ.11,800 కోట్ల విలువైన 29 మెగా ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వగా, మరో రూ.8,000 కోట్ల పెట్టుబడులకు అవగాహన ఒప్పందాలు కుదిరాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌ను కేవలం పెట్టుబడుల గమ్యస్థానంగా కాకుండా దీర్ఘకాలిక వృద్ధి భాగస్వామిగా చూడాలని దేశ, విదేశీ పెట్టుబడిదారులకు మంత్రి పిలుపునిచ్చారు.

## 22న 'తల్లికి వందనం' జమ



(మొదటి పేజీ తరువాయి)

అదే రోజు స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్హుల జాబితాను ప్రదర్శించనున్నారు. జాబితాపై అభ్యంతరాలను ఆగస్టు 3 వరకు స్వీకరించి, సప్లిమెంటరీ జాబితాను ఆగస్టు 10న విడుదల చేస్తారు. కొత్తగా ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఆగస్టు 25 వరకు అవకాశం కల్పించగా, అర్హుల జాబితాను ఆగస్టు 30న ప్రకటించి అదే రోజు నగదు జమ చేస్తారు. ఈసారి అంగన్‌వాడీ విద్యార్థులను కూడా పథకంలో చేర్చడం విశేషం. మరోవైపు సుమారు 1.55 లక్షల కుటుంబాల గృహ వివరాలు అందుబాటులో లేకపోవడంతో వాటి పరిశీలన కొనసాగుతోందని విద్యాశాఖ తెలిపింది.

ఈ పథకానికి గతంలో అమల్లో ఉన్న అర్హత ప్రమాణాలనే ప్రభుత్వం కొనసాగించింది. గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ.10 వేలలోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.12 వేలలోపు కుటుంబ ఆదాయం ఉండాలి. రేషన్ కార్డు, నిర్దేశిత భూ పరిమితి, నెలకు సగటున 300 యూనిట్లలోపు విద్యుత్ వినియోగం, పురపాలక ప్రాంతాల్లో 1,000 చదరపు అడుగులకు మించని స్థిరాస్తి వంటి నిబంధనలు వర్తిస్తాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్ పొందుతున్న ఉద్యోగులు, ఆదాయపు పన్ను చెల్లించే కుటుంబాలు పథకానికి అనర్హులు కాగా, పారిశుద్ధ్య కార్మికులకు మినహాయింపు ఉంటుంది. కుటుంబ సభ్యుల పేరపై కార్లు ఉంటే అర్హత ఉండదు. అయితే ట్రాక్టర్లు, ఆటోలు, ట్యాక్సీలకు మినహాయింపు కల్పించారు.

## అమరరాజాకు ఏపీ క్షమాపణ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అమరరాజా గ్రూప్ సీఎండీ, మాజీ ఎంపీ గల్లా జయదేవ్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్షమాపణ చెబుతోందని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అమరరాజా సంస్థ వేధింపులకు గురికాకుండా ఉండాల్సిందని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం 'ఎక్స్' వేదికగా స్పందించిన ఆయన, నాలుగు దశాబ్దాలుగా అమరరాజా కేవలం ఆంధ్రప్రదేశ్‌కే కాకుండా దేశ పారిశ్రామిక రంగానికి గర్వకారణంగా నిలిచిందని తెలిపారు.

ప్రపంచ స్థాయి ఉత్పత్తులను తయారు చేస్తూ వేలాది మందికి ఉపాధి కల్పించిన అమరరాజా, చిత్తూరు జిల్లా పేరును దేశవ్యాప్తంగా, అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పిందని లోకేశ్ పేర్కొన్నారు. సొంత రాష్ట్రంలో పరిశ్రమను అభివృద్ధి చేయాలనుకున్న ఒక పారిశ్రామికవేత్తకు ప్రోత్సాహం లభించాల్సిందిపోయి, బెదిరింపులు ఎదురుకావడం బాధాకరమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పుట్టిన సంస్థ తన విస్తరణ కోసం రాష్ట్ర సరిహద్దులు దాటి వెళ్లాల్సి రావడం విచారకరమని వ్యాఖ్యానించారు.

ప్రస్తుతం రాష్ట్రంలో పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పునరుద్ధరిస్తున్నామని, ఈ నేపథ్యంలో అమరరాజా సంస్థకు ఆంధ్రప్రదేశ్ మళ్లీ ఆహ్వానం పలుకుతోందని లోకేశ్ తెలిపారు. అమరరాజా తన ప్రయాణాన్ని ప్రారంభించిన ఈ నేలపైనే భవిష్యత్తులో మరిన్ని విజయగాథలు సృష్టించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అమరరాజాకు అన్ని విధాల సహకారం అందిస్తామని, ఆ సంస్థ కోసం ఆంధ్రప్రదేశ్ తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

## భోగాపురం ఎయిర్‌పోర్టుకు గ్రీన్‌సిగ్నల్




(మొదటి పేజీ తరువాయి)

ఏడాదికి 25 వేల టన్నుల కార్గో నిర్వహించే సామర్థ్యంతో ప్రత్యేక సరకు రవాణా టెర్మినల్‌ను నిర్మించారు. సముద్ర తీరానికి సమీపంలో ఉండటంతో ఎగిరే చేప ఆకృతిలో టెర్మినల్‌ను రూపొందించగా, లోపలి సీలింగ్‌ను సంప్రదాయ ముగ్గుల థీమ్‌తో అలంకరించారు. జీఎంఆర్ సంస్థ అభివృద్ధి చేస్తున్న ఏరోసిటీలో హోటళ్లు, కమర్షియల్ హబ్, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్‌లను కూడా ఏర్పాటు చేస్తోంది. విశాఖ నుంచి విమానాశ్రయానికి అనుసంధానంగా నిర్మిస్తున్న ఏడు రహదారుల్లో ఐదు పూర్తికాగా, మిగిలినవి తుది దశలో ఉన్నాయి.

తొలి దశలో ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణికులకు, రెండో దశలో 1.2 కోట్లకు, తుది దశలో 1.8 కోట్ల మంది ప్రయాణికులకు సేవలు అందించేలా విస్తరణ ప్రణాళిక రూపొందించారు. ఈ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్రలో పర్యాటకం, ఐటీ, పరిశ్రమలు, వ్యవసాయం, సముద్ర ఉత్పత్తుల ఎగుమతులకు కొత్త ఊపు రానుంది. ఇటీవల కేంద్ర హోంశాఖ భోగాపురం విమానాశ్రయాన్ని ఇమిగ్రేషన్ చెక్‌పోస్టా గుర్తిస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడంతో అంతర్జాతీయ విమానాల రాకపోకలకు మార్గం సుగమమైంది. దీంతో దేశంలోని కేటగిరీ-1 అంతర్జాతీయ విమానాశ్రయాల జాబితాలో 39వ విమానాశ్రయంగా భోగాపురం స్థానం సంపాదించింది. ఇది ఉత్తరాంధ్ర అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలవనుందని అధికారులు భావిస్తున్నారు.

## సెప్టెంబరులో స్థానిక పోరు..!



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ప్రాథమిక ప్రణాళిక ప్రకారం సెప్టెంబర్‌లో ముందుగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించి, అనంతరం జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు, చివరిగా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఎన్నికల షెడ్యూల్‌పై తుది నిర్ణయం త్వరలో తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ఎన్నికలకు పార్టీ శ్రేణులను సిద్ధం చేసే క్రమంలో ఈ నెల 27వ తేదీ నుంచి 45 రోజుల పాటు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల్లో ఇంటింటికీ వెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలని సూచించారు. డోర్-టు-డోర్ ప్రచారాన్ని ఎన్నికల సన్నాహక కార్యక్రమంగా వినియోగించుకోవాలని పార్టీ నాయకత్వం స్పష్టం చేసింది.

ఇటీవల జరిగిన జోనల్ కోఆర్డినేటర్లు, పార్టీ నేతల సమావేశంలో ఈ అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు తెలిసింది. ఎన్నికలకు ముందే పార్టీ, ప్రభుత్వ యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఖాళీగా ఉన్న నామినేటెడ్ పదవులను వీలైనంత త్వరగా భర్తీ చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు సమాచారం. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ కార్యకలాపాలు మరింత వేగం పుంజుకునే అవకాశం కనిపిస్తోంది.

# అందరికీ విద్యుత్ సబ్సిడీ..



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** :ఆక్వా రైతుల విద్యుత్ సబ్సిడీ విధానాన్ని నిర్వీర్యం చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇప్పుడు ఆక్వా రైతుల గురించి మాట్లాడటం ఆశ్చర్యకరమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. ఈ మేరకు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఓ నోట్ ను విడుదల చేశారు. జగన్ ప్రభుత్వ హయాంలోనే ఆక్వా ప్రాంతాన్ని ఆక్వా, నాన్ ఆక్వా జోన్‌లుగా విభజించి వేలాది మంది రైతులను విద్యుత్ సబ్సిడీకి దూరం చేశారని మంత్రి పేర్కొన్నారు. జగన్ రెడ్డి తీసుకొచ్చిన ఈ విధానంతోనే ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ విధానాన్ని సరిదిద్దుతూ అర్హులైన ఆక్వా రైతులందరికీ విద్యుత్ సబ్సిడీ అందేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించి ప్రతి అర్హులైన రైతన్నలకు రూ.1.50కే యూనిట్ విద్యుత్ అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్న కూటమి ప్రభుత్వం వ్యవసాయ రైతులతో పాటు ఆక్వా రైతులకు రాయితీతో, చేనేత కార్మికులు, స్వర్ణకారులు, నాయి బ్రాహ్మణులకు నిర్దేశిత యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తోందని మంత్రి గొట్టిపాటి వివరించారు. వివిధ వర్గాల జీవనోపాధికి అండగా నిలిచేలా ఉచిత విద్యుత్ ను కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో విద్యుత్ రంగంతో పాటు ఆక్వా రంగం, ఇతర కీలక వ్యవస్థలను వైఎస్సార్సీపీ ప్రభుత్వం దెబ్బతీసిందని మంత్రి ఆరోపించారు. ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారం చేస్తూ జగన్ వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. జగన్ మోహన్ రెడ్డి చేపడుతున్న యాత్రలు, పర్యటనలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాకుండా రాజకీయ స్వలాభం కోసమేనని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

# స్థానికులకే 95% ఉద్యోగాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. 1975 నాటి రాష్ట్రపతి ఉత్తర్వుల స్థానంలో కొత్త నిబంధనలను అమల్లోకి తీసుకువస్తూ పలు శాఖల్లోని పోస్టులను జిల్లా, జోనల్, మల్టీ జోనల్ క్యాడర్లుగా వర్గీకరించారు. కొత్త ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రాన్ని ఆరు జోన్లు, రెండు మల్టీ జోన్లుగా విభజించగా, ప్రత్యక్ష నియామకాలలో 95 శాతం పోస్టులు స్థానికులకు, మిగిలిన 5 శాతం పోస్టులు మాత్రమే ఓపెన్ కోటాలో భర్తీ చేయనున్నారు.

కొత్త క్యాడర్ వ్యవస్థ అమలులో భాగంగా నియామకాలు, పదోన్నతులు, సీనియారిటీ, బదిలీలకు జిల్లా, జోన్, మల్టీ జోన్లను స్వతంత్ర యూనిట్లుగా పరిగణిస్తారు. జూనియర్ అసిస్టెంట్ పోస్టులను అన్ని శాఖల్లో జిల్లా క్యాడర్‌గా, కొన్ని ఉన్నత స్థాయి పోస్టులను జోనల్ క్యాడర్‌గా వర్గీకరించారు. అయితే ఏపీ సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాలు, ప్రత్యేక కార్యాలయాలు, రాష్ట్రస్థాయి సంస్థలు, రాజధాని ప్రాంత పోలీసు కమిషనరేట్ పోస్టులకు ఈ విధానం వర్తించదు. క్యాడర్ పునర్వ్యవస్థీకరణ పూర్తయ్యే వరకు కొత్త పోస్టుల సృష్టి, పోస్టుల ఉన్నతీకరణ, ప్రత్యక్ష నియామకాలు, పదోన్నతులు, బదిలీలు, డిప్యుటేషన్లపై ప్రభుత్వం తాత్కాలిక నిషేధం విధించింది.

ఉద్యోగుల విభజనను పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఉద్యోగుల సీనియారిటీ జాబితాలు సిద్ధం చేసి, కొత్త జిల్లాలకు వారి నుంచి ఐచ్ఛికాలు స్వీకరించనున్నారు. మొత్తం ప్రక్రియను ఆగస్టు 5లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా, అనంతరం భార్యాభర్తల (స్పౌజ్) బదిలీ దరఖాస్తులను స్వీకరించి ఆగస్టు 12లోపు పరిష్కరించేందుకు కార్యాచరణ రూపొందించింది. ఈ పునర్వ్యవస్థీకరణతో రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ, స్థానిక రిజర్వేషన్ల అమలు మరింత పారదర్శకంగా, సక్రమంగా జరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

# బిసిలు ఐక్యంగా ఉండాలి



- **జాతీయ బిసి చైతన్య సమితి ఆధ్వర్యంలో మండల కమిటీ ఏర్పాటు**

**బ్రహ్మంగారి మఠం(జర్నలిస్ట్ ఫైల్ )** జాతీయ బిసి సమైక్య సమితి ఆధ్వర్యంలో బ్రహ్మంగారిమఠం మండల కమిటీ ఏర్పాటుకు బ్రహ్మంగారిమఠం మండలంలోని బీసీ కులాలకు చెందిన నాయకులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. జాతీయ బిసి చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బిసి రమణ ఆదేశాలతో బ్రహ్మంగారిమఠం మండల కమిటీ ఏర్పాటుకు గురువారం మండలంలోని వివిధ కులాల బీసీ నాయకులతో బ్రహ్మంగారిమఠం లోని బ్రహ్మంగారి పార్కు నందు సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో అన్ని కులాల నాయకులు పాల్గొని రాబోయే రోజుల్లో బీసీ కులాలు అందరూ రాజకీయాలకతీతంగా ఏకతాటిపై ఉంటూ ఐక్యంగా ఉండాలి అనే నినాదంతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో వివిధ కులాల నాయకులు మాట్లాడుతూ బ్రహ్మంగారి మఠం మండలంలో మొట్టమొదటిసారిగా జాతీయ బీసీ చైతన్య సమితి ఆధ్వర్యంలో మండల కమిటీ ఏర్పాటు చేయుటకు అందరూ సముకత వ్యక్తం చేశారు. కాబట్టి అతి తొందరలో బ్రహ్మంగారిమఠం మండలంలో జాతీయ బిసి చైతన్య సమితి ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయుటకు నిర్ణయించడం జరిగింది. ఈ సమావేశానికి బ్రహ్మంగారిమఠం మండలంలో ఉన్న అన్ని కులాల నాయకులు అందుబాటులో ఉన్నవారు

## ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్తు డిమాండ్ పైపైకి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్తును సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ విద్యుత్తు సంస్థల ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆగస్టు నుంచి సెప్టెంబర్ మధ్య అంచనాల మేరకు అవసరమయ్యే విద్యుత్తు, ఉత్పత్తి సామర్థ్యం, థర్మల్ కేంద్రాల్లో బొగ్గు నిల్వలు, బహిరంగ మార్కెట్‌లో విద్యుత్తు కొనుగోళ్లకు సంబంధించిన ప్రణాళికలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం చర్చించారు. 'జులై 15న విద్యుత్తు వినియోగం రికార్డు స్థాయిలో 285 మిలియన్ యూనిట్లు నమోదైంది. రాష్ట్ర విద్యుత్తు రంగ చరిత్రలో జులై మాసానికి సంబంధించి ఇదే అత్యధిక డిమాండ్. రాబోయే నెలల్లో డిమాండ్ మరింత పెరగవచ్చు. డిమాండ్‌ను అంచనా వేసి విద్యుత్తు ఎక్స్ఛేంజీలు, టర్మ్ అహెడ్ మార్కెట్ ద్వారా ముందస్తుగా డిస్కంలు కొనుగోలు చేయాలి.

# పోలవరం-మోదీ వరం







(మొదటి పేజీ తరువాయి)

అనంతరం "జై పోలవరం... జై జై ప్రధాని మోదీ" నినాదాల మధ్య ప్రాజెక్టు వద్దకు చేరుకున్న బీజేపీ అగ్రనేతలు నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో సమీక్షించారు. "పోలవరం పూర్తి కావడం ప్రతి ఆంధ్రుడి ఆకాంక్ష. రాష్ట్ర భవిష్యత్తు కోసం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంపూర్ణ సహకారంతో ఈ మహత్తర ప్రాజెక్టు త్వరగా పూర్తయ్యేలా మా కృషి నిరంతరం కొనసాగుతుంది" అని బీజేపీ నేతలు స్పష్టం చేశారు.

ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడిగా భావించే పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణ పనులపై కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రి వై. సత్యకుమార్ యాదవ్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు పార్థసారథి, ఎన్. ఈశ్వరరావు తదితరులతో కలిసి పీవీఎన్ మాధవ్ అధికారులతో విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. నిర్మాణ పురోగతి, పునరావాసం, బ్యాక్‌వాటర్ ప్రభావం, పర్యాటకాభివృద్ధి, మౌలిక వసతులు, భవిష్యత్ కార్యాచరణపై అధికారులు సమగ్ర వివరాలు అందించారు.

అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రస్తుతం 80 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయని, ఈ వరద సీజన్‌లో కూడా ప్రధాన నిర్మాణాలకు ఎలాంటి ఆటంకం ఉండదని వివరించారు. బ్యాక్‌వాటర్ ప్రభావంపై వ్యక్తమవుతున్న సందేహాలను సంబంధిత రాష్ట్రాలకు శాస్త్రీయ ఆధారాలతో వివరించాలని సూచించారు. చేపల సంచారానికి అనుకూలంగా స్పిల్‌వే ఎడమవైపు ప్రత్యేక మార్గాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పునరావాస కాలనీల్లో తాగునీరు, దేవాలయాలు, పాఠశాలలు వంటి మౌలిక వసతులపై ఎస్టీ కమిషన్ ప్రతినిధులు సమస్యలను ప్రస్తావించగా, గిరిజనుల భూములకు సంబంధించిన అంశాలను కూడా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ సోము వీర్రాజు తెలిపారు.

పోలవరం ప్రాంతాన్ని దేశంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైంది. రాజమహేంద్రవరం--పోలవరం--విమానాశ్రయం అనుసంధాన రహదారి విస్తరణ, పాపికొండలు, పట్టిసీమ, గండి పోచమ్మ ఆలయంలను కలుపుతూ సమగ్ర టూరిజం సర్క్యూట్ అభివృద్ధికి ప్రతిపాదనలు వచ్చాయి. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆలోచనలకు అనుగుణంగా జల మార్గాల (వాటర్ నేవిగేషన్) అభివృద్ధిపై కూడా చర్చించారు.

ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, 2014 తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో పోలవరం ప్రాజెక్టుకు కొత్త ఊపిరి లభించిందన్నారు. జాతీయ ప్రాజెక్టు హోదా, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ ఏర్పాటు, ముంపు మండలాల విలీనం, పర్యావరణ అనుమతులు, పూర్తి స్థాయి నిధుల మంజూరు వంటి కీలక నిర్ణయాలతో కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టు పురోగతికి బాటలు వేసిందన్నారు. ప్రస్తుతం స్పిల్‌వే పూర్తై, ఎర్త్‌కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ నిర్మాణం వేగంగా సాగుతోందని తెలిపారు.

కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ, పోలవరం రాష్ట్ర ప్రజల చిరకాల స్వప్నమని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక చొరవతో కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేస్తోందన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల సమన్వయంతో ప్రాజెక్టు వేగంగా ముందుకు సాగుతోందని, పోలవరం పూర్తయితే వ్యవసాయం, తాగునీరు, విద్యుత్, పర్యాటకం వంటి అన్ని రంగాల్లో రాష్ట్రానికి అపార ప్రయోజనాలు చేకూరుతాయని పేర్కొన్నారు.

రాష్ట్ర మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని, అధికారులు అదే స్థాయిలో పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు.

ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ, రాష్ట్ర విభజన తర్వాత పోలవరం ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడిగా మారిందని, నిర్మాణ వ్యయమంతా కేంద్ర ప్రభుత్వమే భరిస్తోందని పేర్కొన్నారు. పనుల్లో ఎదురయ్యే ప్రతి సమస్యను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

సమీక్ష అనంతరం బీజేపీ నేతలు "పోలవరం-మోదీ వరం" పేరుతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గండి పోచమ్మ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాజెక్టు నిర్మాణం, పునరావాసం, పర్యాటకాభివృద్ధిని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లి పోలవరాన్ని రాష్ట్ర అభివృద్ధికి ప్రధాన చోదకశక్తిగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు.

# అమరావతి పూర్తయితే లక్ష కోట్ల ఆదాయం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి రామానాయుడు ఖండించారు. ప్రతిపక్షంలో ఉండగా అమరావతి రాజధానిని స్వాగతిస్తున్నానని, 30,000 ఎకరాలు సరిపోవని, తాను ఇక్కడ ఇల్లు కట్టుకుంటున్నానని, అమరావతి రాజధాని కదిలే ప్రసక్తి లేదని జగన్ రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించిన విషయాలను రామానాయుడు గుర్తు చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే, మాట మార్చి, మడమ తిప్పి మూడు రాజధానులు అంటూ, మూడుముక్కలాట ఆడాడని విమర్శించారు. తాను ప్రతిపాదించిన మూడు రాజధానుల లో మూడు ఇటుకలు కూడా పెట్టకుండా ఐదేళ్ళు కాలయాపన చేశాడన్నారు. పదవిపోయి పదకొండు సీట్లు కే పరిమితమైనా, ఇప్పుడు మళ్లీ మాట మార్చి మావిగన్ అంటూ మతిస్థిరం లేని మాటలు మాట్లాడుతున్నాడని దుయ్య బట్టారు. ఆ పార్టీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి విజయవాడ రాజధాని అంటున్నారు. పెద్దిరెడ్డి 30 రాజధానులు అంటున్నారు. ఇలా ఆ గొడ్డలి పార్టీకి రాజధాని విషయంలో వాళ్లలో వాళ్లకే క్లారిటీ లేదని రామానాయుడు విమర్శించారు. పిచ్చి తుగ్లక్ సైతం, అసూయ, ఆశ్చర్య పోయేలా అమరావతి పై గొడ్డలి పార్టీ నాయకుడు



మాట్లాడుతున్నాడన్నారు.

కర్ణాటకకు బెంగుళూరు, తమిళనాడుకు చెన్నై, తెలంగాణాకు హైదరాబాద్ నుండి 70 శాతం ఆదాయం అందిస్తున్నట్లే, ఆంధ్రప్రదేశ్ కు అమరావతి ఆదాయం ఇస్తుందన్నారు. అమరావతి రాజధాని వైఖరిలో జగన్ తీరు చూస్తే ఊసరవెల్లి సైతం సిగ్గుపడుతుందని ఎద్దేవా చేశారు. సచివాలయం అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, సుమారు 16,000 మంది ఒకేచోట పని చేసే విధంగా 5 ఐకానిక్ టవర్లు డిజైన్ చేశారన్నారు. ప్రపంచం లోనే అత్యంత పొడవైన సెక్రటేరియట్ భవనంగా 204 మీటర్లు ఎత్తుతో నిర్మిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. దేశంలోనే సచివాలయం, హెచ్ఓడి టవర్లు ఒకే చోట మెదటి సారిగా నిర్మిస్తున్నది మన రాష్ట్రంలోనే అని రామానాయుడు కొనియాడారు.

దేశంలోనే మొదటి డయా గ్రిడ్ బిల్డింగ్, లోపల ఎటువంటి పిల్లర్లు, లేకుండా, తుఫాన్ లు, వంటి ప్రకృతి వైపరీత్యాలు తట్టుకునేలా నిర్మిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లకు 12 టవర్లలో 276 ప్లాట్స్ 90 శాతం నిర్మాణం పూర్తయ్యాయని మున్సిపల్ మంత్రి నారాయణ నిమ్మలకు, పల్లాకు చూపించారు. అల్ ఇండియా సర్వీస్ అధికారులకు 6 టవర్ల తో 138 ప్లాట్స్ 95 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయని నారాయణ సహచరులకు వివరించారు.

చంద్రబాబు నాయకత్వం లో ప్రపంచ స్థాయిలో ప్రజా రాజధాని నిర్మిస్తున్నామని మంత్రులిద్దరూ, పల్లా శ్రీనివాసరావు చెప్పారు. సీడ్ యాక్సెస్ రోడ్ కోసం మొత్తం 45.47 ఎకరాలకు గాను, 99.5 శాతం మంది రైతులు నుండి భూమిని సమీకరించామన్నారు. ఇంకా కేవలం 1.52 ఎకరాలు మాత్రమే భూ సమీకరణ ద్వారా రావలసి ఉందని ఇది కేవలం 0.5% మాత్రమేనని రామానాయుడు చెప్పారు. కేవలం ఒకరో, ఇద్దరో రైతులు రాజకీయ దురుద్దేశ్యం తో భూములు ఇవ్వకుండా అడ్డు పడుతున్నారని ఆయన అన్నారు.

# కుంచనపల్లి సెక్షన్‌లో విద్యుత్ విజిలెన్స్ విస్తృత తనిఖీలు



- **65 మందికి రూ.5.48 లక్షల అపరాధ రుసుము**

**గుంటూరు (జర్నలిస్ట్‌ఫైల్)** : సీఆర్‌డీఏ సర్కిల్ పరిధిలోని కుంచనపల్లి సెక్షన్‌లో విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాలు గురువారం సంయుక్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించాయి. రక్షక ఇంజనీర్ సీహెచ్. రమేష్ ఆధ్వర్యంలో చిర్రావూరు, గుండిమెడ, ఇప్పటం, కొలనుకొండ, కుంచనపల్లి, మల్లెంపూడి, ప్రాతూరు, తాడేపల్లి, వడ్డేశ్వరం గ్రామాల్లో 35 బృందాలుగా ఏర్పడిన 35 మంది అధికారులు, 105 మంది సిబ్బంది మొత్తం 2,378 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశారు. తనిఖీల్లో మీటరు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడిన ఒకరికి రూ.2 వేల, అనుమతించిన కేటగిరికి భిన్నంగా విద్యుత్ వినియోగించిన ఇద్దరికి రూ.4 వేల, అనుమతించిన లోడుకు మించి విద్యుత్ వినియోగించిన 62 మందికి రూ.5.42 లక్షలతో కలిపి మొత్తం 65 మందిపై రూ.5.48 లక్షల అపరాధ రుసుము విధించినట్లు విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్. వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి. నాగేశ్వరరావు సంయుక్త ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ మీటర్లకు సీలు తప్పనిసరిగా ఉండేలా వినియోగదారులు చూసుకోవాలని, సీలు దెబ్బతిన్నా లేదా ఊడిపోయినా వెంటనే విద్యుత్ శాఖకు లిఖితపూర్వకంగా సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు. భారత విద్యుత్ చట్టం-2003లోని సెక్షన్ 135 ప్రకారం మీటర్ల సీల్స్ తొలగించడం, పనిచేయని లేదా అక్రమ మీటర్ల ద్వారా విద్యుత్ వినియోగించడం విద్యుత్ చౌర్యంగా పరిగణిస్తారని హెచ్చరించారు. మొదటిసారి తప్పిదానికి కాంపౌండింగ్ అవకాశం ఉన్నప్పటికీ, రెండోసారి నేరం రుజువైతే అరెస్టు, రిమాండ్‌తో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విద్యుత్ చౌర్యంపై సమాచారం ఉన్నవారు 9440812263, 9440810260 నంబర్లకు లేదా వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# జీఎంసీ ఖాళీ స్థలాలకు బోర్డులు ఏర్పాటు చేయాలి

- **అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు కమిషనర్ ఆదేశం**

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్)** : గుంటూరు నగరపాలక సంస్థకు చెందిన ఖాళీ స్థలాల్లో జీఎంసీ బోర్డులు ఏర్పాటు చేసి, వాటి అభివృద్ధికి ప్రాంతాల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కృష్ణానగర్, కుందుల రోడ్, నల్లపాడు, శ్యామలనగర్, విద్యానగర్, గోరంట్ల తదితర ప్రాంతాల్లో పర్యటించిన ఆయన జీఎంసీ స్థలాలు, అభివృద్ధి పనులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసిన భవనాలను పరిశీలించారు. నగరపాలక సంస్థ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, ప్రతి స్థలంలో జీఎంసీ బోర్డులు ఏర్పాటు చేయాలని, కోర్టు కేసులకు సంబంధించిన కౌంటర్లను అవసరమైన ఆధారాలతో దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. నల్లపాడు ప్రధాన రహదారి, రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో డ్రెయిన్ నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్మాణ వ్యర్థాలను వెంటనే తొలగించాలని కమిషనర్ సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు జరగాలని, నిర్మాణ దశ నుంచే వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగితే వెంటనే నోటీసులు జారీ చేయాలని, నిర్మాణ సామగ్రిని రోడ్లపై ఉంచకుండా, సి అండ్ డి వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ముస్లిం స్మశాన వాటిక 'జన్నతుల్ బఖీ'లో ఆధునిక సౌకర్యాలు









- **అభివృద్ధి చేసిన పనులకు ప్రారంభించిన మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, మాజీ మండలి ఛైర్మన్ మహ్మద్ అహ్మద్ షరీఫ్**

**తాడేపల్లి(జర్నలిస్ట్ ఫైల్)** : తాడేపల్లి మండలం పోలకంపాడులోని ముస్లిం స్మశాన వాటిక "జన్నతుల్ బఖీ"లో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ తన సొంత నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తికావడంతో, వాటిని నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, శాసన మండలి మాజీ ఛైర్మన్, ఆంధ్రప్రదేశ్ మైనార్టీ వ్యవహారాల నేత మహ్మద్ అహ్మద్ షరీఫ్ ప్రారంభించారు.

ముస్లిం సోదరుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్మశాన వాటికలో ప్రహరీ గోడ, ఆకర్షణీయమైన ముఖద్వారం, ఆరు మినార్లు, వజూ ఖానా, గ్రీనరీ, కార్యాలయ గది, స్టోర్ రూమ్, వాచ్‌మన్ గది,ఐ మాక్స్ లైటింగ్, అంతర్గత మౌలిక సదుపాయాలు, విశ్రాంతి కోసం సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయడంతో పాటు, 80 ట్రక్కుల మట్టితో లెవెలింగ్ పనులు చేపట్టి అంతిమ సంస్కారాలకు వచ్చే కుటుంబ సభ్యులకు గౌరవప్రదమైన, సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ముస్లిం కుటుంబాలు, మత పెద్దలు మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ, ప్రతి మనిషి జీవితంలోని చివరి ఘట్టమైన అంతిమ సంస్కారాలు గౌరవప్రదంగా, సంప్రదాయబద్ధంగా జరిగేలా అవసరమైన సదుపాయాలు కల్పించాలనే సంకల్పంతో మంత్రి నారా లోకేష్ ఈ పనులు చేపట్టడం అభినందనీయమన్నారు. ముస్లిం సమాజం అవసరాలను గుర్తించి అన్ని హంగులతో స్మశాన వాటికను అభివృద్ధి చేయించినందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

శాసన మండలి మాజీ ఛైర్మన్ మహ్మద్ అహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ, కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరి మనోభావాలను గౌరవిస్తూ అందరికీ సమాన ప్రాధాన్యత ఇస్తున్న నాయకుడు నారా లోకేష్ అని కొనియాడారు. సొంత నిధులతో ముస్లిం స్మశాన వాటికను అభివృద్ధి చేయించడం ఆయన సేవాభావానికి నిదర్శనమని పేర్కొన్నారు. మంగళగిరి ప్రజలు అలాంటి సమర్థ నాయకుడిని ఎన్నుకోవడం అదృష్టమని, చివరి మజిలీ కూడా గౌరవప్రదంగా జరిగేలా లోకేష్ చొరవ తీసుకోవడం ప్రశంసనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయరావు, గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు, ప్రధాన కార్యదర్శి దార దాసు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎంఎస్ బేగ్, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్, రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ షేక్ హసన్ బాషా, ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమీ ఛైర్మన్ ఫరూఖ్ షుబ్లీ, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎండీ ఇబ్రహీం, స్టేట్ వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షేక్ అక్రమ్, స్టేట్ హజ్ కమిటీ సభ్యులు షేక్ జబిన్,పఠాన్ ఖాసీం ఖాన్,షేక్ రియాజ్, అబ్దుల్ మజీద్, ఎండీ నిజాముద్దీన్,పఠాన్ జానీ ఖాన్, ఫిరోజ్,షేక్ హస్నన్,అబ్దుల్లా ఖాన్,షేక్ సుభాని, నాగుల్ మీరా, చాంద్ బాషా, మస్తాన్ వలి, దుబాయ్ మస్తాన్, జామియా మస్జీద్, నూరాని మస్జీద్, మామూర్ మస్జీద్, పోలకంపాడు మక్కా మస్జీద్ కమిటీల సభ్యులు, పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## "షాద్‌నగర్ అభివృద్ధే నా ధ్యేయం.. షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రతి వార్డులో మౌలిక వసతులు కల్పిస్తాం"




**షాద్నగర్ ,(జర్నలిస్ట్‌ఫైల్):** పట్టణంలోని ప్రతి వార్డులో మెరుగైన మౌలిక వసతులు కల్పించి సమగ్ర అభివృద్ధి సాధించడమే తన లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం షాద్‌నగర్ మున్సిపాలిటీ 12వ వార్డులో రూ.10 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఫరూక్‌నగర్ అభివృద్ధికి తాను పూర్తిగా కట్టుబడి ఉన్నానని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే షాద్‌నగర్ పట్టణం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నిధులు మంజూరు చేసి ప్రతి వార్డులో రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మున్సిపల్ కమిషనర్ సునీతా రెడ్డి, కౌన్సిలర్ కళ్యాణ్‌కార్ దిలీప్ కుమార్, రిజ్వానా బేగం, ముబారక్ అలీ ఖాన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖదీర్, ఫరూక్‌నగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, తుపాకుల శేఖర్, నవీన్, గంగామోని సత్తయ్య, రవితేజ, సీతారాం, ప్రదీప్ ముదిరాజ్, బీఎల్‌ఓలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## తక్షణమే స్పందించిన డాక్టర్ రాజశేఖర్ గౌడ్, శ్రీజ లకు ప్రజల ప్రశంసలు



**ఖమ్మం, (జర్నలిస్ట్‌ఫైల్):** ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన ఓ అత్యవసర పరిస్థితిలో అధికారులు మానవత్వంతో స్పందించి ఒక అధికారికి సకాలంలో వైద్య సహాయం అందించారు.విషయంలోకి వెళితే ఖమ్మం జిల్లా, ముదిగొండ మండలానికి చెందిన వ్యవసాయ శాఖ అసిస్టెంట్ (ఏఈ)కు కలెక్టరేట్‌లో ఉన్న సమయంలో అకస్మాత్తుగా గుండెపోటు లక్షణాలు కనిపించాయి. ఈ విషయాన్ని గమనించిన లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ శ్రీజ వెంటనే స్పందించి, అక్కడే విధుల్లో ఉన్న సీహెచ్‌వో డాక్టర్ రాజశేఖర్ గౌడ్ తో కలిసి అత్యవసర వైద్య సహాయం అందేలా చొరవ తీసుకున్నారు.డాక్టర్ రాజశేఖర్ గౌడ్ తక్షణ చికిత్స అందించడంతో బాధిత అధికారికి ప్రాథమిక వైద్య సహాయం సకాలంలో లభించింది. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.ఈ ఘటనను ప్రత్యక్షంగా చూసిన కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలు, డాక్టర్ రాజశేఖర్ గౌడ్, అదనపు కలెక్టర్ శ్రీజ చూపిన అప్రమత్తత, మానవత్వాన్ని అభినందిస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. సమయానికి స్పందించడం వల్ల ఒక ప్రాణాన్ని కాపాడే అవకాశం కలిగిందని పలువురు అభిప్రాయపడ్డారు.

## వడ్డీ వ్యాపారుల అక్రమ దందా ప్రైవేట్ వ్యక్తులచే డబ్బులు వసూలు



**సంగారెడ్డి, (జర్నలిస్ట్‌ఫైల్):** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం ,మున్సిపాలిటీలో జోరుగా సాగుతున్న వడ్డీ వ్యాపారం దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది. వడ్డీ వ్యాపారుల అరాచకాలు అంతా ఇంత కాదు చాలా ఇబ్బందులకు గురిచేస్తూ వారు చెప్పినట్టు డబ్బులు కడితే మంచిది లేదంటే వారిని నట్టేట ముంచే స్తున్నారు. ఈ ప్రాంతంలో వడ్డీ వ్యాపారులని ఆడింది ఆట పాడింది పాటగా కొనసాగుతుంది. ఈ తంతు అడిగే నాధుడే కరువయ్యారు. నారాయణఖేడ్ ప్రాంతంలో జోరుగా వడ్డీ వ్యాపారాలు ఇచ్చేటప్పుడు ఒక మాట డబ్బులు ఇచ్చినంక ఇంకొక మాట మాట్లాడి ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఆపద ఉన్నప్పుడు ఎవరి అవసరాలకు వారు డబ్బులు తీసుకుంటారు. అదే ఆసరా చేసుకుని వడ్డీ వ్యాపారులు ఇష్టరాజంగా సామాన్యుడి దగ్గర నిలువు దోపిడీ చేస్తున్నారు. డబ్బులు కడతారా కట్టండి లేదంటే ఇంటి దగ్గరికి ప్రైవేట్ గుండాలను తీసుకు వచ్చి గొడవలు చేస్తూ బెదిరింపులకు గురి చేస్తున్నారు. ఈ విషయంపై అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదు చాలా కుటుంబాలు రోడ్డున పడ్డారు. బాధితులు ఇంత వడ్డీ వసూలు చేస్తున్నారు అని అడిగితే అది నా ఇష్టం అంటూ మీరు ఎవరికి చెప్పకుంటే వారికి చెప్పుకోండి నూటికి 3 రూపాయలు లేదా 4, 5 రూపాయలు వడ్డీలు వసూలు చేస్తూ చాలా కుటుంబాలు సర్వనాశనం అయిపోయి రోడ్డున పడ్డారు. బాధితులు ఎవరికి చెప్పుకుందామన్న భయంతో చెప్పుకోలేకపోతున్నారు. ఇదే ఆసరా చేసుకుని పలు కుటుంబాల ఇంటి దగ్గరకు వెళ్లి బెదిరింపులకు గురి చేస్తున్నారు. నారాయణఖేడ్ లో చాలామంది వడ్డీ వ్యాపారం చేస్తూ బాధితుల రక్తం తాగుతున్నారు. వడ్డీ వ్యాపారులు కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు ఈ వడ్డీ వ్యాపారులపై జిల్లా అధికారులు, పోలీస్ యంత్రాంగం చర్యలు తీసుకోకపోతే చాలా మంది కుటుంబాలు ఆత్మహత్య శరణం అంటూ బాధితులు వాపోతున్నారు. వడ్డీ వ్యాపారులు వడ్డీ వ్యాపారం చేస్తూ పెద్ద పెద్ద బిల్డింగులు కడుతున్నారు. కొందరు వ్యక్తులు పట్టాదారులపై భూములు రిజిస్ట్రేషన్ చేసుకుని డబ్బులు ఇస్తూ బెదిరింపులకు గురి చేస్తున్నారు. ఇప్పటికైనా వడ్డీ వ్యాపారులపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి జిల్లా పర్యటకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేయండి -ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్





**ఖమ్మం, (జర్నలిస్ట్‌ఫైల్):** వైరా నియోజక వర్గంలోని కొణిజర్ల మండలం అంజనపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గోద్రెజ్ పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్న నేపథ్యంలో చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీసు కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫ్యాక్టరీ ప్రాంగణం, సభా వేదిక, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాంతాలు, రాకపోకల మార్గాలు, భద్రతా ఏర్పాట్లు, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులు, గోద్రెజ్ సంస్థ ప్రతినిధులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమమని, పనిచేసి ప్రతి ఏర్పాటును ముందస్తుగా పూర్తి చేయాలని, ప్రారంభోత్సవ కార్యక్రమానికి రైతులు, ప్రజలు తరలి వచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు.సభా ప్రాంగణంలో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను శాస్త్రీయంగా రూపొందించాలని, వీఐపీలు, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళలు, మీడియా ప్రతినిధులు, ప్రజల కోసం ప్రత్యేక మార్గాలు, ప్రత్యేక కూర్చునే ఏర్పాట్లు చేయాలని తెలిపారు. బ్యారికేడింగ్, సూచిక బోర్డులు, తగినంత వెలుతురు, తాగునీటి సదుపాయం, తాత్కాలిక మరుగుదొడ్లు, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాలను అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని సూచించారు.భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసు శాఖకు సూచిస్తూ, ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా బహుస్థాయి భద్రతా చర్యలు చేపట్టాలని అన్నారు. సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వీఐపీ మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలు, ప్రజల రాకపోకలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.హెలిప్యాడ్ నుండి సభా ప్రాంగణం వరకు ప్రయాణ మార్గాలను ముందుగానే పూర్తిస్థాయిలో పరిశీలించి, రహదారుల మరమ్మతులు, శుభ్రత, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను పూర్తి చేయాలని తెలిపారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేసి, ప్రజలకు ముందస్తుగా సమాచారం అంభద్రని సంబంధిత అధికారులను ఆదేశించారు.వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అంబులెన్సులు, వైద్య బృందాలు, అత్యవసర చికిత్సా కేంద్రాలను సిద్ధంగా ఉంచాలని, అగ్నిమాపక శాఖ ఫైర్ టెండర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యుత్ శాఖ నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, వ్యర్థాల తొలగింపు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం రాష్ట్రంలో పామాయిల్ సాగు అభివృద్ధికి ప్రోత్సాహకరంగా నిలుస్తుందని ఈ కార్యక్రమం ద్వారా రైతులకు మార్కెటింగ్, ప్రాసెసింగ్ సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. అందుకు తగిన విధంగా రైతుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు.సభా ప్రాంగణంలోని ప్రతి విభాగాన్ని సంబంధిత శాఖల అధికారులు స్వయంగా పరిశీలించి, ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడంలో ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించి, అప్పగించిన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో పోలీసు ఉన్నతాధికారులు, అదనపు కలెక్టర్లు, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, రెవెన్యూ, విద్యుత్, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, రవాణా, మున్సిపల్, వ్యవసాయ, ఉద్యాన, పరిశ్రమల శాఖల అధికారులు, గోద్రెజ్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ ఫారంల సమర్పణకు సమీపించిన గడువు

### - త్వరితగతిన ఫారంలను బీ.ఎల్.ఓలకు అందజేయాలి కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నిజామాబాద్, (జర్నలిస్ట్‌ఫైల్):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా ఎన్యూమరేషన్ ఫారంల సమర్పణకు గడువు ముగియనున్న నేపథ్యంలో ఓటర్లు త్వరితగతిన తమ ఫారంను బీ.ఎల్.ఓలకు అందించాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు.వివరాలను డిజిటలైజ్ చేయాల్సి ఉందన్నారు.అంతేకాకుండా ఆబ్సెంట్,షిఫ్టెడ్,డెత్ డిలీటెడ్ (ఏ.ఎస్.డీ)ఓటర్ల జాబితాను సైతం రూపొందించాల్సి ఉన్నందున చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వెంటదివెంట ఎన్యూమరేషన్ ఫారాలను బీ.ఎల్.ఓలకు అందించాలని అన్నారు.ప్రత్యేకించి నిజామాబాద్ అర్బన్ నియోజక వర్గం పరిధిలోని ఓటర్లు ఫారం అందజేసే విషయంలో తాత్సారం చేయవద్దని సూచించారు.ఎన్యూమరేషన్ ఫారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే ఓటరు జాబితా నుండి పేరు గల్లంతు అవుతుందని తెలిపారు.ఒకవేళ ఎవరికైనా గత 2002 ఎస్ఐఆర్ వివరాలు తెలియకపోతే సర్కిల్ వారీగా నెలకొల్పిన హెల్ప్ డెస్క్ ను,లేదా బీఎల్ఓలను సంప్రదించాలని సూచించారు.అయినప్పటికీ వివరాలు తెలియని పక్షంలో ప్రస్తుత ఓటరు జాబితా వివరాలు పొందుపరచి ఫారం సమర్పించవచ్చని అన్నారు.అలాంటి వారి పేరు కూడా ముసాయిదా ఓటరు జాబితాలో చేర్చబడుతుందని తెలిపారు.వారికి ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఈ.ఆర్.ఓ) నోటీసు జారీ చేసే హియరింగ్ కు పిలుస్తారని,ఎన్నికల సంఘం నిర్దేశించిన 13 రకాల గుర్తింపు ధృవీకరణ పత్రాలలో ఏదైనా ఒక దానిని చూపిస్తే ఓటరు తుది జాబితాలో పేరు చేరుస్తారని అన్నారు.దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారం అందజేయాలని కలెక్టర్ సూచించారు.ఈ విషయంలో బూత్ లెవెల్ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో ఉంటూ క్రియాశీలక పాత్ర పోషించాలని,ప్రతి రోజు ఓటర్ల నుండి 50 చొప్పున ఫారంలు సేకరించి బీ.ఎల్.ఓలకు అందించేలా చొరవ చూపాలన్నారు.ఈ.ఆర్.ఓలు,ఏ.ఈ.ఆర్.ఓలు కూడా క్షేత్రస్థాయిలో ఉంటూ,ఎన్యూమరేషన్ ఫారంల సేకరణ,వాటి డిజిటలైజేషన్ ప్రక్రియలు వేగవంతం అయ్యేలా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ సూచించారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా అందుబాటులో లేని,చనిపోయిన,శాశ్వతంగా వలస వెళ్ళిన,రెండు చోట్ల ఓటు కలిగిన ఓటర్ల పేర్లను గుర్తిస్తూ పక్కాగా జాబితాను రూపొందించి,వాటిపై బీ.ఎల్.ఏల సంతకాలు తీసుకోవాలన్నారు.

## నిజామాబాద్ నుండి యూ.కేకు బియ్యం ఎగుమతులు

### - లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్



**నిజామాబాద్, (జర్నలిస్ట్‌ఫైల్):** భారత్–యునైటెడ్ కింగ్‌డమ్ మధ్య అమల్లోకి వచ్చిన సమగ్ర ఆర్థిక,వాణిజ్య ఒప్పందం (Comprehensive Economic Trade Agreement – CETA) ద్వారా ఎగుమతులకు లభిస్తున్న అవకాశాలను వినియోగించుకుంటూ నిజామాబాద్ నగరంలోని గజానన్ రైస్ మిల్ యాజమాన్యం యునైటెడ్ కింగ్‌డమ్‌కు బియ్యం ఎగుమతులకు అనుమతులు సాధించింది.ఈ మేరకు గజానన్ రైస్ మిల్లు నుండి యూ.కే కు ఎగుమతి అవుతున్న సోనా మసూరి ఎక్స్పోర్ట్ క్వాలిటీ బియ్యం నిల్వలతో కూడిన వాహనాలకు కలెక్టర్ ఇలా త్రిపాఠి లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....సీఈటీఏ అమలుతో భారతీయ వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో మరింత ప్రాధాన్యత లభిస్తోందని తెలిపారు.ముఖ్యంగా తెలంగాణలో నాణ్యమైన వరి ఉత్పత్తికి ప్రసిద్ధి చెందిన నిజామాబాద్ జిల్లా నుంచి యూకేకు బియ్యం ఎగుమతులు ప్రారంభం కావడం జిల్లాకు గర్వకారణమని అన్నారు.అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన బియ్యాన్ని ఉత్పత్తి చేసి విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా రైతులకు మెరుగైన ధరలు లభించడంతో పాటు జిల్లాకు మంచి గుర్తింపు వస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.భవిష్యత్తులో మరిన్ని దేశాలకు కూడా జిల్లా నుంచి వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు పెరిగేలా అధికారులు,ఎగుమతిదారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరస్వామి,ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్,గజానన్ రైస్ మిల్ ప్రతినిధి హితేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి ఖమ్మం జిల్లా రహదారుల అభివృద్ధికి కేంద్రమంత్రికి తుమ్మల లేఖలు

**- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి నాలుగు ప్రత్యేక లేఖలు**
**- ఖమ్మం- అశ్వారావుపేట రహదారి నాలుగు వరుసలుగా మార్పు- ఔటర్ బైపాస్‌లో మిగిలిన 7 కి.మీ లింకుకు మంజూరు కోరిన మంత్రి - కొత్తగూడెం- పాల్వంచలకు 25 కి.మీ బైపాస్ ప్రతిపాదన - భద్రాచలం పట్టణానికి రూ.25 కోట్లతో బైపాస్, తక్కువ వ్యయంతో శాశ్వత పరిష్కారం**



హైదరాబాద్,16 జర్నలిస్ట్‌ఫైల్: ఖమ్మం జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి, ప్రయాణికుల భద్రత లక్ష్యంగా రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత-జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర రోడ్డు రవాణా, రహదారులు, ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి నితిన్ జైరాం గడ్కరీకి నాలుగు ప్రత్యేక లేఖలు రాశారు. ఖమ్మం-అశ్వారావుపేట రహదారి నాలుగు వరుసలుగా మార్పు, ఖమ్మం ఔటర్ బైపాస్‌లో మిగిలిన లింకు మంజూరు, కొత్తగూడెం-పాల్వంచ పట్టణాలకు బైపాస్ నిర్మాణం, భద్రాచలం పట్టణానికి బైపాస్ మంజూరుపై ఈ లేఖల్లో ఆయన వివరించారు.

## - భద్రాచలం పట్టణానికి బైపాస్, కరకట్ట హైవేతో పోలిస్తే అత్యంత తక్కువ ఖర్చు

ఏపీ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సహా పలు ఉత్తరాది రాష్ట్రాలను కలిపే జాతీయ రహదారి-30 ప్రస్తుతం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం ఉన్న భద్రాచలం పట్టణం నడిబొడ్డు గుండా వెళ్తోందని మంత్రి తుమ్మల తెలిపారు. ఇసుక లారీలు, పారిశ్రామిక, వ్యవసాయ వాహనాలతో పాటు ఏటా భారీ సంఖ్యలో వచ్చే భక్తుల రద్దీ కలగలిసి తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. 10 కిలోమీటర్ల పరిధిలోనే తొమ్మిది ప్రమాద ప్రాంతాలు (బ్లాక్‌స్పాట్లు) ఏర్పడి, ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాన పండుగల సమయాల్లో ట్రాఫిక్ నియంత్రణ కోసం భారీ వాహనాలను గంటల తరబడి నిలిపివేయాల్సి రావడంతో భక్తులకు తీవ్ర అసౌకర్యం, సరుకు రవాణాకు ఆలస్యం, రవాణా ఖర్చులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు.ఇటీవల భద్రాచలం కరకట్ట మీదుగా ప్రత్యామ్నాయ హైవే నిర్మాణ ప్రతిపాదన తెరపైకి వచ్చినా, దానికి రూ.120 కోట్ల భారీ వ్యయం అవుతుందని మంత్రి గుర్తుచేశారు. అదే భద్రాచలం పట్టణానికి ప్రత్యేక బైపాస్ రోడ్డు నిర్మిస్తే కేవలం రూ.25 కోట్లతోనే పూర్తి చేయవచ్చని, ఖర్చు తక్కువగా ఉండటమే కాకుండా శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు. ఈ బైపాస్‌తో దీర్ఘకాలిక ట్రాఫిక్ రవాణాకు, ముఖ్యంగా భారీ వాణిజ్య వాహనాలకు పట్టణం గుండా వెళ్లే అవసరం తప్పుతుందని, భక్తులకు సురక్షిత, సౌకర్యవంతమైన ప్రయాణం లభిస్తుందని, ప్రమాదాలు గణనీయంగా తగ్గి, ప్రయాణ సమయం ఆదా అవుతుందని, సరుకు రవాణా మెరుగుపడి ప్రాంత పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఎన్‌హెచ్-30 వ్యూహాత్మక ప్రాధాన్యతను, భద్రాచలంలో రహదారి భద్రత అవసరాన్ని పరిగణనలోకి తీసుకుని బైపాస్ నిర్మాణానికి పరిపాలన, ఆర్థిక అనుమతులు తక్షణమే మంజూరు చేయాలని మంత్రి కోరారు.

## - ఖమ్మం- శ్వారావుపేట నాలుగు వరుసలుగా మార్చాలి

జాతీయ రహదారి 365బీబీలోని ఖమ్మం-అశ్వారావుపేట మార్గాన్ని, జాతీయ రహదారి 563లోని వరంగల్-ఖమ్మం మార్గాన్ని తొలుత నాలుగు వరుసలుగా విస్తరించాలని ప్రతిపాదించినట్లు మంత్రి గుర్తుచేశారు. అయితే జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ప్రస్తుత రహదారుల విస్తరణకు బదులు ఖమ్మం-దేవరపల్లి (365బీజీ), వరంగల్-ఖమ్మం (163జీ) పేరుతో కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ రహదారులను చేపట్టిందని తెలిపారు. దీంతో ప్రస్తుత 365బీబీ, 563 రహదారుల విస్తరణ పక్కనపెట్టినట్లు వివరించారు.ఖమ్మం, వెంకటాయపాలెం, తనికెళ్ల, కొణిజర్ల, పల్లిపాడు, వైరా, పినపాక, తల్లాడ, అంజనాపురం, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, గంగారం, మండలపల్లి, అశ్వారావుపేట తదితర జనావాసాల గుండా సాగే ఈ 122 కిలోమీటర్ల రహదారిపై ట్రాఫిక్ ఒత్తిడి కొనసాగుతుందని, సుమారు 40 బ్లాక్‌స్పాట్లు ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రజా భద్రత, ప్రాంత అభివృద్ధి దృష్ట్యా ఈ మార్గాన్ని కేంద్ర రహదారుల శాఖకు (మోర్త్) తిరిగి అప్పగించి, నాలుగు వరుసల పనులకు ప్రత్యేక కేసుగా పరిగణించి మంజూరు చేయాలని కోరారు.

## ఖమ్మం ఔటర్ బైపాస్‌లో మిగిలిన 7 కిలోమీటర్ల లింకు

గ్రీన్‌ఫీల్డ్ రహదారుల నిర్మాణంతో ఖమ్మం పట్టణానికి పశ్చిమ, దక్షిణ, ఆగ్నేయ దిశల్లో బైపాస్ ఏర్పడిందని, సూర్యాపేట-ఖమ్మం నాలుగు వరుసల రహదారి, ఖమ్మం-కురవి (365ఏ) పనులతో ఉత్తర భాగం కూడా పూర్తవుతుందని మంత్రి తెలిపారు. దీంతో ప్రతిపాదిత ఖమ్మం ఔటర్ బైపాస్‌లో దాదాపు 80 శాతం సిద్ధమైందని, అయితే ఖమ్మం-కురవి మార్గానికి, వరంగల్-ఖమ్మం (163జీ) మార్గానికి మధ్య ఆగ్నేయ దిశలో 7 కిలోమీటర్ల కీలక అనుసంధాన లింకు మిగిలి ఉందని వివరించారు.ఖమ్మం-కురవి మార్గాన్ని అమరావతి-నాగపూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే లింకుతో అనుసంధానిస్తే ఖమ్మం చుట్టూ నిరంతర రింగ్ రోడ్డు పూర్తిస్థాయిలో సాకారమవుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ లింకు పూర్తయితే ఖమ్మం చుట్టూ అన్ని జాతీయ రహదారుల మధ్య నిరంతర అనుసంధానం ఏర్పడి, పట్టణంలోకి భారీ వాహనాల రాకపోకలు తగ్గి, రద్దీ, ప్రమాదాలు తగ్గుతాయని పేర్కొన్నారు. గత రెండు వార్షిక ప్రణాళికల్లో ఈ ప్రతిపాదన చేర్చినా నిధులు మంజూరు కాలేదని గుర్తుచేస్తూ, ఇప్పటికే భారీగా పెట్టుబడులు పెట్టిన నేపథ్యంలో మిగిలిన లింకుకు ప్రాధాన్యతపై పరిపాలన, ఆర్థిక అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## - కొత్తగూడెం, పాల్వంచలకు బైపాస్ అవసరం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాల మీదుగా సాగే జాతీయ రహదారి 30, ప్రస్తుతం కొత్తగూడెం, పాల్వంచ పారిశ్రామిక పట్టణాల నడిబొడ్డు గుండా వెళ్తుండటంతో తీవ్ర ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాలు, పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయని మంత్రి తెలిపారు. ఇసుక లారీలు, పారిశ్రామిక, వ్యవసాయ వాహనాల రాకపోకలతో సుమారు 23 బ్లాక్‌స్పాట్లు ఏర్పడి ప్రాణనష్టం సంభవిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గౌరెల్లి -కొత్తగూడెం మధ్య ఎన్‌హెచ్-930 పూర్తయితే ట్రాఫిక్ మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో కారుకొండ, సూరారం, రామవరం, లక్ష్మీదేవిపల్లి, ఓల్డ్ పాల్వంచ, జగన్నాధపురం మీదుగా 25 కిలోమీటర్ల బైపాస్ నిర్మించి, ఎన్‌హెచ్-930పి, ఎన్‌హెచ్-30లను అనుసంధానించాలని మంత్రి ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టుతో రహదారి భద్రత మెరుగుపడటంతో పాటు, ప్రయాణ సమయం తగ్గి, పారిశ్రామిక, ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని పేర్కొంటూ, ప్రాధాన్యతపై మంజూరు ఇవ్వాలని కోరారు.

# కారంపూడి కేజీబీవీలో విద్యార్థినులకు కంటి పరీక్షలు

**నేటి శుభోదయ 15 జూలై పల్నాడు జిల్లా కారంపూడి**



కారంపూడి: జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా కారంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కస్తూరిబాయి గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్ఆర్‌సీహెచ్ కార్యక్రమం పరిధిలో బాలికల కంటి ఆరోగ్యాన్ని పరిశీలించి, కళ్లజోళ్లు అవసరమైన విద్యార్థినులను గుర్తించి రిఫరల్ చేశారు. అలాగే స్వల్ప కంటి సమస్యలు ఉన్న విద్యార్థినులను గుర్తించి వారికి తగిన ఆరోగ్య సలహాలు అందించారు.ఈ కార్యక్రమంలో పారామెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ జి. లక్ష్మీనారాయణ, పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.కే. అఫ్రీన్, హెల్త్ సూపర్వైజర్లు టి.యల్. మస్తాన్ వలి, యం .లాలునాయక్ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# 2027 మార్చికల్లా పోలవరం ఫేజ్-1 పూర్తి లక్ష్యం



ఏలూరు,16 జర్నలిస్ట్‌ఫైల్: గోదావరి పుష్కరాలకు ముందుగానే 2027 మార్చి నాటికి పోలవరం ఫేజ్-1 ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్యాచరణను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. ప్రాజెక్టు పనుల పురోగతిపై సీఎం ఎప్పటికప్పుడు అధికారులకు మార్గనిర్దేశం చేస్తూ, నిర్దిష్ట లక్ష్యాలతో ముందుకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. ఏలూరులోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ పోలవరం రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమైన బహుళార్ధ సాధక ప్రాజెక్టు అని, నెలల వారీగా, తేదీల వారీగా లక్ష్యాలు నిర్దేశించి పనులు వేగవంతం చేస్తున్నారని చెప్పారు. నిర్ణయించిన గడువులోనే ప్రాజెక్టును పూర్తి చేసి దేశానికి అంకితం చేస్తారనే నమ్మకం వ్యక్తం చేశారు.

**-- వైసీపీపై విమర్శలు**

2019--2024 మధ్య వైసీపీ పాలనలో పోలవరం ప్రాజెక్టు పురోగతి పూర్తిగా నిలిచిపోయిందని ఎమ్మెల్యే బడేటి చంటి ఆరోపించారు. ఐదేళ్ల పాలనలో ప్రాజెక్టు నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

**--- సంక్షేమంపై రాజకీయాలు తగవు**

సంక్షేమ పథకాల అమలుపై వైసీపీ చేస్తున్న విమర్శలు రాజకీయ ప్రేరేపితమైనవేనని ఆయన పేర్కొన్నారు. పరామర్శల పేరుతో ప్రజలను మరోసారి తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం మాత్రం పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తోందని స్పష్టం చేశారు.

**--- ముద్రగడకు నివాళి**

మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మృతిపై ఎమ్మెల్యే బడేటి చంటి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. తాను నమ్మిన సిద్ధాంతాల కోసం రాజీపడకుండా పోరాడిన పట్టుదల గల నాయకుడిగా ముద్రగడను కొనియాడుతూ, ఆయన కుటుంబ సభ్యులకు తన సానుభూతి తెలిపారు.

# సంక్షోభంలో ఉన్న ఆక్వా రైతులను ఆదుకోవాలి

**- రొయ్యలు,చేపలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి**
**- పెంచిన ఆక్వా మేత ధరలు తగ్గించాలి**
**- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ డిమాండ్**



ఏలూరు, 16 జర్నలిస్ట్‌ఫైల్: ఆక్వా రంగం,ఆక్వా రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని, సంక్షోభంలో ఉన్న ఆక్వా రైతులను అన్ని విధాలా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం కలిదిండిలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఆక్వా రైతుల సమస్యలపై రైతు సంఘం సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు వీరవల్లి భాస్కరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కె. శ్రీనివాస్ మాట్లాడుతూ ట్రంప్ సుంకాలు, అమెరికా సాగిస్తున్న యుద్ధాలు వలన ఆక్వా రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని చెప్పారు. అయితే ఇక్కడ వ్యాపారులు, ఎగుమతి దారులు సిండికేట్ గా మారి రొయ్యలు, చేపలకు తక్కువ ధరలు ఇవ్వడం వలన ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. సిండికేట్ వ్యాపారాన్ని అరికట్టడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని విమర్శించారు. పైగా ఇటీవల ఫీడ్ కంపెనీలు ఆక్వా మేత ధరలను విపరీతంగా పెంచి వేయడం దారుణమన్నారు. దీనివలన ఉత్పత్తి ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రొయ్యల మేత ధరలు కిలోకు రూ.10 లు వరకు పెంచారన్నారు. పెంచిన ఆక్వా మేత ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన ఫీడ్, నాణ్యమైన సీడ్ రైతులకు అందించాలని కోరారు. నష్టపోతున్న ఆక్వారైతులను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకునే చర్యలు చేపట్టాలన్నారు.రొయ్యలు,చేపలకు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆక్వా రైతులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహంకాళీరావు, పలువురు రైతు సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీలంక పర్యటనకు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

**-కొలంబో విమానాశ్రయంలో ఘన స్వాగతం**




అవనిగడ్డ,16 జర్నలిస్ట్‌ఫైల్: శ్రీలంక పర్యటనకు వెళ్లిన అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కు కొలంబో విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. బుధవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వ విద్యాలయం ఉపకులపతి నిత్యానందరావు, రిజిస్ట్రార్ హనుమంతరావు, డి.విజయభాస్కర్, అనురాధ విమానాశ్రయం చేరుకున్నారు. వారికి శ్రీలంక తెలుగు కాంగ్రేస్ అధ్యక్షులు అన్నూజగన్, కలవి భూషణ్, రత్న ప్రభృతులు ఆత్మీయ స్వాగతం పలికారు.

# గుడివాడ ఓటర్ల జాబితా సవరణ పూర్తి..

**డ్రాఫ్ట్‌లో 1.82 లక్షల మంది.-ఆర్డీవో బాలసుబ్రమణ్యం**



గుడివాడ,16 జర్నలిస్ట్‌ఫైల్: ఈ నెల 14వ తేదీ వరకు అందిన అన్ని దరఖాస్తుల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయిందని ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల సంఘం అదనంగా మరో 10 రోజులు గడువు పొడిగించిందని చెప్పారు.గుడివాడ పట్టణం, రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల ఓటర్లందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మొదటి విడత ఎన్యూమరేషన్‌లో శాశ్వత వలస కారణంగా 4,998 మందిని, అలాగే చిరునామా మారిన లేదా అందుబాటులో లేని ఓటర్లను గుర్తించామన్నారు. ఇప్పటివరకు గుడివాడ నియోజకవర్గ డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్‌లో 1,82,634 మంది పేర్లు నమోదయ్యాయన్నారు. చనిపోయిన వారి కింద 7,117 మందిని, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లున్న 3,892 కేసులను తొలగింపు జాబితాలో చేర్చామని వివరించారు.ఇంకా పేరు నమోదు చేసుకోని వారు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా ఫారం సమర్పించి డ్రాఫ్ట్ జాబితాలో పేరు చేర్పించుకోవచ్చనీ తెలిపారు. ఒకవేళ ఇప్పుడు మిస్ అయినా 31వ తేదీన విడుదలయ్యే తుది డ్రాఫ్ట్‌లో కొత్తగా పేరు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు.ఏవైనా సందేహాలుంటే ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌తో పాటు గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు తహశీల్దార్ కార్యాలయాలు, మున్సిపల్ ఆఫీస్ మరియు ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లను సంప్రదించాలని ఓటర్లకు ఆర్డీవో బాలసుబ్రమణ్యం సూచించారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



/చింతూరు,16 జర్నలిస్ట్‌ఫైల్: మండల వ్యాప్తంగా ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని అలానే ఇతర సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో ఐ టి డి ఏ ముందు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి మధ్యాహ్న భోజన యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామలక్ష్మి, జిల్లా అధ్యక్షులు పుష్ప, జిల్లా గౌరవ అధ్యక్షులు శాంతిరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చెయ్యాలి. మధ్యాహ్నం భోజన కార్మికులకి పెండింగ్ వేతనాలు చెల్లించాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. రోజువారి మెస్ చార్జీలను ఒక్కొక్కర విద్యార్థికి 20 రూపాయలు ఇవ్వాలి. కనీస వేతనం అమలు చేయాలి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి. బ్యాంకుల్లో స్టేట్మెంట్లు ఇవ్వాలి. ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలి. అని అన్నారు. అనంతరం తదితర డిమాండ్ తో కూడిన వినతి పత్రానికి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వారికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ నా పరిధిలో ఉన్నటువంటి సమస్యలు పరిష్కారం చేస్తాను మిగతావి ప్రభుత్వాన్ని దృష్టికి కూడా తీసుకెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ పోడియం లక్ష్మణ్. మండల కమిటీ సభ్యులు చింత రాంబాబు. మధ్యాహ్న భోజన కార్మికులు కుంజా లక్ష్మి. సోడి గంగమ్మ. సున్నం ఇరుమమ్మ. తదితరులు పాల్గొన్నారు.




# మహిళల భద్రత మనందరి బాధ్యత

**: ఎ యస్ పి హేమంత్**



చింతూరు,16 జర్నలిస్ట్‌ఫైల్: మహిళల భద్రత మనందరి బాధ్యత అని చింతూరు ఏ యస్ పి హేమంత్ పేర్కొన్నారు. చింతూరులో బుధవారం మహిళల భద్రతపై స్థానికులు చే ర్యాలీ నిర్వహించారు. మహిళలపై జరుగుతున్న మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. మహిళలకు జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, మొబైల్లో వచ్చే మెసేజ్ మోసాల పట్ల, అప్రమత్తంగా ఉండాలని ఎ యస్ పి పేర్కొన్నారు. మహిళల భద్రత గూర్చి అవగాహన సదస్సును చింతూరు గ్రామం లోని వారాంతపు సంతలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు.పోలీసువున్నతాధికారులైన జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ గ్రామాన పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొబైల్ వాడకం పెరిగిన ప్రతి మోసాలు పెరుగుతున్నాయని మహిళలు, యువత అప్రమత్తంగా ఉండాలని కోరారు. మహిళలను, విద్యార్థినులను ఎవరైనా ఈవ్ టీజింగ్ చేస్తే 112 నెంబర్ కు కాల్ చేయాలన్నారు. మహిళల భద్రత గూర్చి మాట్లాడుతూ కొంతమంది మోసగాళ్లు మొబైల్ ద్వారా మహిళలను ట్రాప్ చేసి మోసగిస్తారని మొబైల్ తో అప్రమత్తంగా ఉండాలని అలాంటివారు ఎవరైనా మహిళలను అల్లరి పెడితే తమ దృష్టికి తేవాలన్నారు. విద్యార్థినులు శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. .మొబైల్ వాడకం పెరుగడం వల్ల మోసాలు కూడా అంతే స్థాయి లో పెరుగు తున్నాయన్నారు.మొబైల్ లో .మొబైల్ లో డిజిటల్ అరెస్ట్ చేశామని మొబైల్ వాడకం దారులకు అక్రమ కాల్స్ వస్తుంటాయని, అలాంటి అరెస్టులు ఏమి ఉండవని, ఆ విధమైన కాల్స్ వస్తే వెంటనే తమకు తెలపాలని కోరారు. అలాగేయువతను ఉద్దేశించి చెడు వ్యసనాలపై అవగాహన కల్పించారు. బహిరంగంగా మద్యం సేవించడం కూడా నేరమేనన్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెంచి బహిరంగంగా మద్యం సేవించే వారిని కనుగొని కేసులు పెడతామని, వదిలిపెట్టేది లేదని, అలాగే అతివేగంగా వాహనాలు నడపటం, లైసెన్సు లేకుండా వాహనాలు నడపటం, ద్విచక్ర వాహనంపై ముగ్గురు నలుగురు కూర్చొని ప్రయాణించటం నేరం అన్నారు. వాహన యజమానులు తమ మైనర్ బాల బాలికలకు వాహనాలు నడపటానికి ఇవ్వకూడదని, అలా ఇవ్వడం నేరమని మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు పెడతామని పేర్కొన్నారు .గంజాయి సేవించడం, అక్రమ రవాణా చేయుటం, అక్రమ రవాణా చేసే వారికి సహకరించటం నేరమేనని, జైలు జీవితం గడపాల్సి వస్తుందని, గంజాయి వ్యాపారం ద్వారా సంపాదించిన ఆస్తులు ఎవరికన్నా ఉంటే ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని పేర్కొన్నారు. అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు తమ గ్రామాలకు వస్తే తమకు సమాచారం అందించాలని కోరారు.అలాగే రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరు పాటించాలని కోరారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తామని యువత, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సి ఐ గోపాలకృష్ణ తో పాటు మహిళా పోలీస్ స్టేషన్ సి ఐ కన్నప రాజు ,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


# చింతూరు మండల తెలుగుదేశం పార్టీ మండల స్థాయి సమావేశం విజయవంతం



చింతూరు,16 జర్నలిస్ట్‌ఫైల్: చింతూరు మండల పార్టీ క్యాంపు కార్యాలయంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎం.డి. జమాల్ ఖాన్ అధ్యక్షతన మండల స్థాయి సమావేశం విజయవంతంగా నిర్వహించారు.ఈ సమావేశానికి మండలంలోని వివిధ కమిటీల అధ్యక్షులు, జనరల్ సెక్రటరీలు, ఉపాధ్యక్షులు, క్లస్టర్, కో-క్లస్టర్ ఇంచార్జులు, యూనిట్ ఇంచార్జులు, బి యల్ ఏ లు, కే యస్ యస్ సభ్యులు, మహిళా కార్యకర్తలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఇటీవల మండలంలోని అన్ని యూనిట్లలో నిర్వహించిన సమావేశాల ద్వారా గ్రామాల వారీగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, అభివృద్ధి అవసరాలు, ప్రభుత్వ పథకాల అమలులో ఉన్న ఇబ్బందులు, తాగునీరు, రహదారులు, విద్యుత్, సాగునీరు, గృహాలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై యూనిట్ ఇంచార్జులు తమ గ్రామాల తరఫున వినతిపత్రాలను మండల అధ్యక్షులు ఎం.డి. జమాల్ ఖాన్ కు సమర్పించారు.అనంతరం ప్రతి గ్రామం నుంచి అందిన వినతిపత్రాలను సమావేశంలో సవివరంగా పరిశీలించి, ఒక్కో సమస్యపై చర్చించారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను ప్రాధాన్యత ఆధారంగా సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని తీర్మానించారు . అలాగే ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిస్థాయిలో అందేలా పార్టీ నాయకులు గ్రామస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు.పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయడంతో పాటు, ప్రతి కార్యకర్త సభ్యత్వ కార్డును వినియోగంలో ఉంచాలని, బూత్, యూనిట్, క్లస్టర్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త సమిష్టిగా పనిచేయాలని సూచించారు.చివరిగా సమావేశాన్ని విజయవంతం చేసిన పార్టీ నాయకులు, వివిధ కమిటీల సభ్యులు, యూనిట్ ఇంచార్జులు, మహిళా కార్యకర్తలు మరియు కార్యకర్తలందరికీ మండల అధ్యక్షులు ఎం.డి. జమాల్ ఖాన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## జులై 17న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన

-- ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలి: కలెక్టర్ కృతికా శుక్లా



16 జర్నలిస్ట్ ఫైల్:
:జులై 17న జిల్లాలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటించనున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు.వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పర్యటనకు సంబంధించిన ప్రతి అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.హెలిప్యాడ్, సభా ప్రాంగణం, రహదారులు, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, వైద్య సేవలు, అగ్నిమాపక సదుపాయాలు, వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లు ఎక్కడా లోపం లేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని, అప్పగించిన బాధ్యతలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

## పంట బీమా గడువు జూలై 31 వరకు పొడిగింపు

సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటరాముడు



యాడికి 16 జర్నలిస్ట్ ఫైల్:
:మండలంలోని నిట్టూరు, కమలపాడు గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గుత్తి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) శ్రీ వెంకటరాముడు రైతులతో మాట్లాడారు. సాగు చేసిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పంట నమోదు (ఈ-క్రాప్) చేసుకోవాలని ఆయన సూచించారు. పత్తి, వేరుశనగ పంటలకు బీమా చేసుకోవడానికి వాస్తవానికి ఈరోజుతో గడువు ముగిసినప్పటికీ, రైతుల అభ్యర్థన మేరకు ఈ గడువును జూలై 31వ తేదీ వరకు పొడిగించినట్లు వెల్లడించారు. రైతు సోదరులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పంటలకు బీమా చేయించుకోవాలని కోరారు.విత్తనాలు వేసి 20 రోజులు దాటుతున్నా వర్షాలు లేకపోవడంతో పంటలు కొంతవరకు బెట్ట (ఎండ తీవ్రత)కు గురవుతున్నాయని ఏడీఏ ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో లీటర్ నీటికి 20 గ్రాముల యూరియా లేదా 5 గ్రాముల పొటాషియం నైట్రేట్, లేదా 5 గ్రాముల 19:19:19 కలిపి పంటలపై పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఇలా చేయడం వల్ల మరో పది రోజుల పాటు వర్షాలు పడకపోయినా పంట బెట్టను తట్టుకొని నిలబడుతుందని వివరించారు. రైతు సేవా కేంద్రాల్లో యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు అక్కడి సిబ్బందిని సంప్రదించి వాటిని పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా, గ్రామ వ్యవసాయ అధికారులు రమేష్, యతీష్, నిజాముద్దీన్‌లతో పాటు స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ఖమ్మం జిల్లాలోని క్షయ (టీబీ) వ్యాధిగ్రస్తులకు నిక్షయ్ పోషణ్ యోజన ద్వారా ఆర్థిక పోషకాహార సహాయం

ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

: ఖమ్మం డిఎంహెచ్ఓ డాక్టర్ డి రామారావు



ఖమ్మం, 16 జర్నలిస్ట్ ఫైల్: ఖమ్మం జిల్లాలోని క్షయ (టీబీ) వ్యాధి గ్రస్తులందరికీ కేంద్ర ప్రభుత్వ జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం (ఎన్ టిఈపి) కింద అమలు చేయబడుతున్న 'నిక్షయ్ పోషణ్ యోజన (ఎన్ పివై) "పథకం ఒక గొప్ప వరమని, జిల్లాలోని అర్హులైన రోగులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ఒక ప్రకటనలో కోరారు.ఈ పథకం ద్వారా టీబీ వ్యాధిగ్రస్తులకు చికిత్స కాలంలో మెరుగైన పోషకాహారం అందించడం కోసం నెలకు రూ 1,000 చొప్పున నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోకే జమ చేయడం జరుగుతుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం, వ్యాధి నిర్ధారణ అయిన సమయంలో రూ 3,000 లు, 84 రోజుల చికిత్స పూర్తయిన తర్వాత మరో రూ 3,000 చొప్పున మొత్తం రూ 6,000 ఆర్థిక సహాయం లభిస్తుంది.పథకం ప్రగతి వివరాలు (2025 - 2026), 2025 లో సాధించిన ప్రగతి, గత ఏడాది 2025 లో కేంద్ర ప్రభుత్వం ఖమ్మం జిల్లాకు రూ 17,00,000 విడుదల చేసింది. దీని ద్వారా జిల్లాలోని 283 మంది నమోదిత టీబీ రోగులకు తలా రూ 6,000 చొప్పున ఆర్థిక సహాయం అందించి, వారు సక్రమంగా మందులు వాడేలా, త్వరగా కోలుకునేలా తోడ్పాటునందించాం అని తెలిపారు. 2026 ప్రస్తుత నిధులు , పురోగతి, ఈ ఏడాది (2026) కు గానూ ఖమ్మం జిల్లాకు అత్యధికంగా రూ 39,54,000 నిధులు విడుదలయ్యాయి. ప్రస్తుతానికి 460 మంది అర్హులైన రోగులను గుర్తించాం అని తెలిపారు. ఈ నెల చివరి నాటికి వారి బ్యాంక్ ఖాతాల్లోకి డబ్బులు జమ చేసే ప్రక్రియ వేగంగా జరుగుతోంది. మరో 211 మంది రోగులకు రూ 3,000 చొప్పున, అలాగే 324 మంది రోగులకు రూ 6,000 చొప్పున నిధులు విడుదల చేయాలని రాష్ట్ర టీబీ కార్యాలయానికి ప్రతిపాదనలు పంపాం. అక్కడ ఆమోదం లభించిన వెంటనే ఈ నిధులు కూడా బదిలీ చేయబడతాయి అని తెలిపారు. ఇవే కాకుండా, కొత్తగా గుర్తించిన మరో 189 మంది అర్హులైన టీబీ రోగుల వివరాల పరిశీలన జరుగుతోంది. ప్రక్రియ పూర్తి కాగానే వారికి కూడా నిధులు అందుతాయి. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ విజ్ఞప్తి చేసింది. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆసుపత్రుల్లో క్షయ (టీబీ) వ్యాధికి చికిత్స పొందుతున్న రోగులందరూ తమ వివరాలను నిక్షయ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. ఆర్థిక సహాయం నేరుగా మీ ఖాతాల్లో పడటానికి మీ ఆధార్ కార్డ్, బ్యాంక్ పాస్‌బుక్ వివరాలను స్థానిక ఆరోగ్య కార్యకర్తలకు లేదా సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో అందించాల్సిందిగా కోరుతున్నాం అని తెలిపారు. క్షయ రహిత ఖమ్మం జిల్లా నిర్మాణానికి ప్రజలందరూ సహకరించాలని, టీబీ రోగులు ఈ పోషకాహార పథకాన్ని ఉపయోగించుకుని ఆరోగ్యవంతులు కావాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి ఆకాంక్షించారు.

## సింహాచలం గిరిప్రదక్షిణ ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్




సింహాచలం 16 జర్నలిస్ట్ ఫైల్: దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ బుధవారం సింహాచలం క్షేత్రం గిరిప్రదక్షిణ ఏర్పాట్లను పరిశీలించారు. సింహాచలం కొండపై, కొండకింద ప్రాంతాలతో పాటు తొలిపావంచను సందర్శించి, గిరి ప్రదక్షిణ భక్తులు కొబ్బరికాయలు కొట్టే ప్రదేశాల వద్ద బయటికి వెళ్ళే మార్గములో అదనపు క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని, భక్తులకు కొండ చుట్టూ షెల్టర్లు, తాగునీరు, వైద్య సదుపాయాలు, తాత్కాలిక మరుగుదొడ్లు, తాత్కాలిక విద్యుత్ దీపాల ఏర్పాటు తగిన స్థాయిలో చేయవలసిందిగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కొండపై ఈ నెల 27, 28 తేదీలలో గుడి చుట్టూ 3 సార్లు ప్రదక్షిణ చేసే భక్తులకు, దర్శనం చేసుకొనే భక్తులకు చేయవలసిన ఏర్పాట్ల గురించి నిర్దుష్టమైన సూచనలు చేశారు.

## ఎక్మో విధానంతో ఊపిరితిత్తుల చికిత్సలో సరికొత్త విప్లవం

- చివరిదశ ఊపిరితిత్తుల వైఫల్యానికి అత్యంత అధునాతన వైద్యం అందుబాటులోకి

- యశోద హాస్పిటల్స్ పల్మనాలజిస్ట్ డాక్టర్ తపస్వి కృష్ణ వెల్లడి




ఖమ్మం,16 జర్నలిస్ట్ ఫైల్: యశోద మెడికల్ సెంటర్ ఖమ్మం నందు ఏర్పాటు చేసిన సమావేశంలో హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ కన్సల్టెంట్ ట్రాన్స్‌ప్లాంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ తపస్వి కృష్ణ కాత్రగడ్డ మాట్లాడుతూ తీవ్రమైన శ్వాసకోశ సమస్యలతో , ఊపిరితిత్తులు పూర్తిగా దెబ్బతిని ప్రాణాపాయ స్థితికి చేరుకునే రోగులను కాపాడటంలో 'ఎక్మో' ( కృత్రిమ గుండె - ఊపిరితిత్తుల పరికరం ) విధానం ఒక సంజీవనిలా మారుతోందని తెలిపారు . ఈ అత్యంత సంక్లిష్టమైన వైద్య విధానం యొక్క విశిష్టతను, మౌలిక సదుపాయాల వివరాలను వెల్లడించారు . ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ రాష్ట్రాల్లోని రోగులకు అంతర్జాతీయ స్థాయి క్రిటికల్ కేర్ వైద్య సదుపాయాలు ఏ విధంగా అందుబాటులోకి వచ్చాయో వివరించడానికి , చివరి దశ ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తుల్లో భరోసా నింపడానికి ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు . ప్రాణం నిలిపే 'ఎక్మో' (కృత్రిమ శ్వాస వ్యవస్థ) విధానం చివరి దశ 'ఇంటర్‌స్టీషియల్ లంగ్ డిసీజ్' లేదా శ్వాసకోశ వైఫల్యం వల్ల ఊపిరితిత్తులు రక్తానికి ఆక్సిజన్‌ను అందించే సామర్థ్యాన్ని పూర్తిగా కోల్పోయినప్పుడు ఈ 'వెనో - వీనస్ ఎక్మో' లైఫ్ సపోర్ట్ విధానాన్ని ఉపయోగిస్తామని అన్నారు . ఈ విధానంలో అత్యాధునిక యంత్రం శరీరం వెలుపల ఉంటూ కృత్రిమ ఊపిరితిత్తుల వ్యవస్థలా పనిచేస్తుంది . ఇది శరీరం నుండి ఆక్సిజన్ లేని చెడు రక్తాన్ని గ్రహించి దానికి పూర్తి ఆక్సిజన్‌ను అందించి కార్బన్ డయాక్సైడ్‌ను తొలగించి మళ్లీ శరీరంలోకి పంపుతుంది . ఊపిరితిత్తుల మార్పిడి అవసరమైన రోగులకు , దాత దొరికేవరకు ప్రాణాలను నిలిపి ఉంచడానికి ఈ సాంకేతిక విధానం అత్యంత కీలకమైనదని డాక్టర్ తపస్వి వివరించారు . సెకన్ల సమన్వయంతో సాగే అవయవ మార్పిడి ఈ ఎక్మో విధానంలో ఉన్న రోగులకు ఊపిరితిత్తుల మార్పిడి చేయడం వైద్యశాస్త్రంలోనే అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ . రక్తం గడ్డకట్టడం , అధిక రక్తస్రావం వంటి తీవ్రమైన సాంకేతిక ప్రమాదాలను అధిగమిస్తూ గుండె - ఊపిరితిత్తుల నిపుణులు , అనస్థీషియా వైద్యులు , ఐసీయూ నర్సింగ్ బృందం సెకన్ల సమన్వయంతో వ్యవహరించి ఈ సుదీర్ఘ శస్త్రచికిత్స ప్రక్రియను విజయవంతం చేయాల్సి ఉంటుందని , ఊపిరితిత్తుల వ్యాధి చివరి దశకు చేరినంత మాత్రాన ఆశలు వదులుకోవాల్సిన అవసరం లేదని , ఎక్మో వంటి అధునాతన మౌలిక సదుపాయాలతో కూడిన వైద్య విధానం ద్వారా ప్రాణాలు నిలపడం సాధ్యమేనని స్పష్టం చేశారు . విజయవంతమైన రికవరీ విధానం శస్త్రచికిత్స అనంతరం అందించే ప్రత్యేక అంతర్జాతీయ క్రిటికల్ కేర్ ప్రోటోకాల్స్ ద్వారా రోగులను ఎక్మో యంత్రం, వెంటిలేటర్ల నుండి సురక్షితంగా తొలగించి , కొత్త ఊపిరితిత్తులతో స్వయంగా శ్వాస తీసుకునేలా చేస్తామని, ఆ తర్వాత క్రియాశీల శారీరక వ్యాయామాల ప్రక్రియ (రిహాబిలిటేషన్) ద్వారా రోగులు సాధారణ జీవితాన్ని గడిపేలా ఈ చికిత్సా విధానం తోడ్పడుతుందని డాక్టర్ తపస్వి వివరించారు . ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ సీనియర్ మేనేజర్ పరమేష్ , అసిస్టెంట్ మేనేజర్ బాలకృష్ణ పాల్గొన్నారు .

## ఆయిల్ పామ్ రంగంలో ఉత్తమ వ్యవసాయ పద్ధతుల అధ్యయనం

- ఖమ్మం జిల్లాలో సీఆర్‌బీ ప్రతినిధుల బృందం పర్యటన



ఖమ్మం, 16 జర్నలిస్ట్ ఫైల్: ఆయిల్ పామ్ రంగ అభివృద్ధికి మార్గదర్శకంగా ఈ అధ్యయనం దోహదపడుతుందని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి యం.వి.మధుసూదన్ తెలిపారు. సెంటర్ ఫర్ రెస్పాన్సిబుల్ బిజినెస్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలలో ఆయిల్ పామ్ రంగంలో అమలవుతున్న ఉత్తమ వ్యవసాయ పద్ధతులు, వినూత్న కార్యక్రమాలు, రైతుల అనుభవాలను నమోదు చేసి అధ్యయనం చేయడానికి 2026 జూలై 13 నుండి 17 వరకు ప్రత్యేక అధ్యయన కార్యక్రమం నిర్వహించబడుతోందనిఅని తెలిపారు. బుధవారం ఖమ్మం జిల్లాలో రఘునాధపాలెం, బాలపేట లోని మానుకొండ రాధా కిషోర్ , తాత రఘురాం ఆయిల్ పామ్ తోటలను, తిరుమలాయపాలెం, కొక్కిరేణి గ్రామంలోని వేమ వేంకటేశ్వర రావు ఆయిల్ పామ్ తోటను, కొణిజర్ల మండలం లోని ఆయిల్ పామ్ నర్సరీ ని సీఆర్‌బీ ప్రతినిధుల బృందం పర్యటన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయిల్ ఫెడ్ అధికారి అశోక్, ఇతర సభ్యులతో కూడిన సీఆర్‌బీ ప్రతినిధుల బృందం సందర్శించి, ఆయిల్ పామ్ సాగు పురోగతి, క్షేత్రస్థాయిలో అమలవుతున్న సాంకేతిక పద్ధతులు, రైతుల అనుభవాలు, ఆయిల్ పామ్ విలువ శ్రేణికి సంబంధించిన అంశాలను పరిశీలించింది.పర్యటన సందర్భంగా ఆయిల్ పామ్ రైతుల క్షేత్రాలు, నర్సరీలు, ప్రాసెసింగ్ మిల్లులను సందర్శించడంతో పాటు రైతులు, అధికారులు, ఇతర భాగస్వాములతో సమావేశాలు నిర్వహించి ఆయిల్ పామ్ సాగులో అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతులను నమోదు చేయనున్నారు.ఈ అధ్యయనంలో ముఖ్యంగా నీటి నిర్వహణ, నేల ఆరోగ్య పరిరక్షణ, సమీకృత చీడపీడల నిర్వహణ (ఐపిఎం), కార్మిక సంక్షేమం, భద్రతా పద్ధతులు, సుస్థిర వ్యవసాయ విధానాలు వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి యం.వి.మధుసూదన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ విస్తరణకు ప్రాధాన్యతనిస్తూ రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, నాణ్యమైన మొక్కలు, శిక్షణ కార్యక్రమాలు, ఇతర సేవలను అందిస్తున్నదని తెలిపారు. ఈ అధ్యయనం ద్వారా తెలంగాణలో అమలవుతున్న ఉత్తమ పద్ధతులు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడంతో పాటు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ అధ్యయనం తుది ఫలితంగా తెలంగాణ రాష్ట్రంలో సుస్థిర ఆయిల్ పామ్ సాగులో అమలవుతున్న ఉత్తమ వ్యవసాయ పద్ధతులు, విజయవంతమైన కార్యక్రమాలు మరియు రైతుల అనుభవాలను ప్రతిబింబించే సమగ్ర అధ్యయన నివేదిక రూపొందించబడుతుంది. ఇది భవిష్యత్తులో ఆయిల్ పామ్ రంగ అభివృద్ధికి మార్గదర్శకంగా ఉపయోగపడనుంది అని తెలిపారు.

## రాష్ట్ర భూగర్భ గనులు ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర కి ఘన స్వాగతం



అనంత పురం 16 జర్నలిస్ట్ ఫైల్: అనంతపురం నగరంలోని ఆర్‌డబి అతిథి గృహంలో బుధవారం జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భూగర్భ గనులు ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర ని, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ సంక్షేమ శాఖ సలహాదారు ఫరూక్ ని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించిన జరిగింది.ఈ సందర్భంగా జిల్లాఅభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై మంత్రితో ఎంపీ ఆత్మీయంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## నైపుణ్యాభివృద్ధి సాధించిన యువతే దేశభవిష్యత్తు



గుడివాడ, 16 జర్నలిస్ట్ ఫైల్: నైపుణ్యాభివృద్ధి సాధించిన యువతే దేశ భవిష్యత్తుకు అత్యంత బలమని ప్రముఖ కెమిస్ట్, రోటరీ నాయకులు యలమంచిలి రెడ్డయ్య చౌదరి పేర్కొన్నారు. యువ నైపుణ్యాల అంతర్జాతీయ దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కమ్యూనికేషన్, డిజిటల్ పరిజ్ఞానం, సమస్య పరిష్కార సామర్థ్యం, నాయకత్వం జట్టు భావన, సమయపాలన క్రమశిక్షణ, వంటి ఐదు అంశాలపై జీవితానికి దగ్గరైన ఉదాహరణలను ఉదహరిస్తూ వారికి వివరించారు. విద్యార్థినీ విద్యార్థులు ఆలోచనా విధానం, సృజనాత్మకత శాస్త్రీయ దృక్పథాన్ని కొనియాడుతూ మరింత ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయాలని ప్రోత్సహించారు. విద్య ఉద్యోగాన్ని ఇస్తుందని, నైపుణ్యం విజయాన్ని అందిస్తుందని స్పష్టం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్ర, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శరత్, వైస్ ప్రిన్సిపాల్, రోటరీ అధ్యక్ష కార్యదర్శులు గుళ్లపల్లి కిరణ్ బాబు, గండు నరేష్, మాజీ సహాయ గవర్నర్ ముళ్ళపూడి రమణమూర్తి,పూర్వ అధ్యక్షులు బలుసు శంకర్రావు తదితరులు పాల్గొని సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు.

## తక్షణమే స్పందించిన డాక్టర్ రాజశేఖర్ గౌడ్, శ్రీజ లకు ప్రజల ప్రశంసలు



ఖమ్మం, 16 జర్నలిస్ట్ ఫైల్: ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన ఓ అత్యవసర పరిస్థితిలో అధికారులు మానవత్వంతో స్పందించి ఒక అధికారికి సకాలంలో వైద్య సహాయం అందించారు.విషయంలోకి వెళితే ఖమ్మం జిల్లా, ముదిగొండ మండలానికి చెందిన వ్యవసాయ శాఖ అసిస్టెంట్ (ఏఈ)కు కలెక్టరేట్‌లో ఉన్న సమయంలో అకస్మాత్తుగా గుండెపోటు లక్షణాలు కనిపించాయి. ఈ విషయాన్ని గమనించిన లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ శ్రీజ వెంటనే స్పందించి, అక్కడే విధుల్లో ఉన్న సీహెచ్‌వో డాక్టర్ రాజశేఖర్ గౌడ్ తో కలిసి అత్యవసర వైద్య సహాయం అందేలా చొరవ తీసుకున్నారు.డాక్టర్ రాజశేఖర్ గౌడ్ తక్షణ చికిత్స అందించడంతో బాధిత అధికారికి ప్రాథమిక వైద్య సహాయం సకాలంలో లభించింది. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.ఈ ఘటనను ప్రత్యక్షంగా చూసిన కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలు, డాక్టర్ రాజశేఖర్ గౌడ్, అదనపు కలెక్టర్ శ్రీజ చూపిన అప్రమత్తత, మానవత్వాన్ని అభినందిస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. సమయానికి స్పందించడం వల్ల ఒక ప్రాణాన్ని కాపాడే అవకాశం కలిగిందని పలువురు అభిప్రాయపడ్డారు.

## గుండెపోటు వచ్చిన వ్యక్తి ప్రాణాలు కాపాడిన ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు

-గుండెపోటు వ్యక్తికి రూ.40 వేల ఉచిత ఇంజెక్షన్

గుడివాడ,16 జర్నలిస్ట్ ఫైల్: గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గుండెపోటుతో అత్యవసరంగా చేరిన ఓ రోగికి రూ.40 వేల విలువైన ప్రాణరక్షక ఇంజెక్షన్‌ను ఉచితంగా అందించి వైద్యులు ప్రాణాపాయం నుంచి కాపాడారు.ప్రభుత్వ సేవ్ హార్ట్ కార్యక్రమంలో భాగంగా అందుబాటులో ఉన్న ఖరీదైన ఇంజెక్షన్‌ను గోల్డెన్ అవర్‌లో అందించడం వల్ల రోగి కోలుకున్నట్లు వైద్యులు తెలిపారు.రోగి తీవ్రమైన గుండెనొప్పితో ఆసుపత్రికి చేరుకోగా, వైద్య బృందం వెంటనే పరీక్షలు నిర్వహించి గుండె రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టినట్లు గుర్తించింది. అనంతరం ఆలస్యం చేయకుండా ప్రాణరక్షక ఇంజెక్షన్‌ను ఇచ్చి చికిత్స అందించారు. దీంతో గుండెకు రక్తప్రసరణ సాధారణ స్థితికి చేరి రోగి ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఈ చికిత్సకు వేలాది రూపాయలు ఖర్చవుతుండగా ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తిగా ఉచితంగా అందించడం పట్ల రోగి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. సకాలంలో స్పందించి సమర్థవంతంగా చికిత్స అందించిన ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, పారామెడికల్ సిబ్బందిని పలువురు అభినందించారు. ప్రభుత్వం పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందించాలనే లక్ష్యానికి ఇది నిదర్శనమని స్థానికులు పేర్కొన్నారు.

## రైతుల పంటల మార్కెటింగ్ బాధ్యత ప్రభుత్వాలదే

--- కార్పొరేట్ కంపెనీల లాభాలకు రైతులను బలి చేయడం తగదు

- రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభలు విజయవంతానికి సహకరించిన అందరికీ ధన్యవాదములు - అభినందన సభలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య




ఏలూరు, 16 జర్నలిస్ట్ ఫైల్: రైతుల పంటల మార్కెటింగ్ బాధ్యత ప్రభుత్వాలదేనని, కార్పొరేట్ కంపెనీల లాభాల కోసం రైతులను బలి చేయవద్దని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి. కృష్ణయ్య కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభలు జయప్రదం చేసిన వలంటీర్లకు,కార్యకర్తలకు అభినందన సభ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.ఎన్.వి.డి.ప్రసాద్ అధ్యక్షతన ఏలూరులోని సిఐటియు జిల్లా కార్యాలయం హాలులో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వి.కృష్ణయ్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభలు ఏలూరులో ఘనంగా నిర్వహించిన ఆహ్వాన సంఘం కమిటీ వారికి, వాలంటీర్స్ గా సేవలు అందించిన వివిధ సంఘాల వారికి, పెద్దలు,ప్రముఖులు, దాతలు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు, సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదములు తెలియజేశారు. రాష్ట్ర రైతు ఉద్యమానికి ఈ మహాసభలు ఎంతగానో తోడ్పడతాయని చెప్పారు. ఈ రైతు రాష్ట్ర మహాసభల్లో రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై ఏడు కమీషన్లుగా చర్చించామని,పంటల వారీగా ఆయా పంటల రైతుల సమస్యలపై ప్రత్యేకంగా చర్చించామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని పంటల రైతుల సమస్యలపై, సాగునీటి ప్రాజెక్టుల సమస్యలపై, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలపై తీర్మానాలు చేసి భవిష్యత్ కార్యాచరణ రూపొందించామని చెప్పారు. మహాసభలో చేసిన తీర్మానాలు అనుగుణంగా రైతాంగ సమస్యలపై సంబంధిత రాష్ట్ర మంత్రులకు, రాష్ట్ర ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందజేసినట్లు వివరించారు. రైతులు కష్టపడి పండించిన పంటలు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పంటల మార్కెటింగ్ అంతా ప్రైవేటు వ్యాపారుల చేతుల్లో ఉండడం వలన వారి కబంధహస్తాల్లో రైతు నలిగిపోతున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కాలంలో మొక్కజొన్న, కందులు, శనగలు, వర్జీనియా పొగాకు, మామిడి,జీడి మామిడి,పత్తి,కోకో,రొయ్యలు తదితర పంటల రైతులు మార్కెటింగ్ మాయాజాలంతో నష్టపోయారని చెప్పారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోకుండా చోద్యం చూశాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలోని రైతులు రోజురోజుకి సంక్షోభంలో కూరుకు పోతున్నారని, ఈ సంక్షోభ కాలంలో రైతును రక్షించుకునేందుకు సమస్యల పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. కార్మిక,కర్షక ఐక్యతతో ముందుకు సాగుదామని చెప్పారు. అసంపూర్ణంగా ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు, జిల్లా ఉపాధ్యక్షులు కోన శ్రీనివాసరావు, జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, సిఐటియు నాయకులు కె. పోశమ్మ, పంపన రవికుమార్, ఎం.ఇస్సాకు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి పి.మంగరాజు, ఐద్వా నాయకురాళ్లు హైమావతి, అరుణ కుమారి, వివిధ సంఘాల నాయకులు సిహెచ్. సుందరయ్య, ముస్తఫా ఆలీ, జి. నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# పరిశోధనకు పెద్దపీట వేసిన ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం



- విద్యార్థులు, అధ్యాపకులకు భారీ ప్రోత్సాహం.. స్కాలర్‌షిప్‌లు, రీసెర్చ్ గ్రాంట్ల పెంపు

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** వైద్య పరిశోధనలను మరింత ప్రోత్సహించేందుకు డా. ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం కీలక నిర్ణయాలు తీసుకుంది. అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల పరిశోధన స్కాలర్‌షిప్‌లను రెట్టింపు చేయడంతో పాటు వాటి విలువను మూడింతలు పెంచింది. అలాగే అధ్యాపకులకు అందించే పరిశోధన గ్రాంట్ల సంఖ్యను ఎనిమిది రెట్లకు పైగా పెంచి, ఒక్కో గ్రాంట్‌కు గరిష్ఠంగా రూ.5 లక్షల వరకు మంజూరు చేయాలని నిర్ణయించింది. జులై 15, 16 తేదీల్లో నిర్వహించిన పీహెచ్.డి కమిటీ సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో వైస్ ఛాన్సలర్ డా. పులాల చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డా. టి. సాయి సుధీర్, పరిశోధన ఒ అభివృద్ధి డైరెక్టర్ డా. ఎం. లక్ష్మీ సూర్యప్రభ, ప్రచురణల డైరెక్టర్ డా. కె. సుధ పాల్గొన్నారు.

**యు.జీ స్టూడెంట్ రీసెర్చ్ స్కాలర్‌షిప్‌లు రెట్టింపు:** అండర్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్ రీసెర్చ్ స్కాలర్‌షిప్ కోసం ఆన్‌లైన్ దరఖాస్తు విధానాన్ని కమిటీ ఖరారు చేసింది. స్కాలర్‌షిప్‌ల సంఖ్యను 500 నుంచి 1,000కు పెంచడంతో పాటు, ఒక్కో స్కాలర్‌షిప్ విలువను రూ.10 వేల నుంచి రూ.30 వేలకు పెంచింది. పరిశోధన వ్యవధిని రెండు నెలల నుంచి ఆరు నెలలకు పొడిగించాలని నిర్ణయించింది.

**200 ఫ్యాకల్టీ రీసెర్చ్ గ్రాంట్లు :** అధ్యాపకులకు అందించే ఫ్యాకల్టీ రీసెర్చ్ గ్రాంట్ల సంఖ్యను 25 నుంచి 200కు పెంచారు. ఒక్కో గ్రాంట్‌కు గరిష్ఠంగా రూ.5 లక్షల వరకు మంజూరు చేయాలని నిర్ణయించారు. ఈ నిధులను పరిశోధనకు అవసరమైన సామగ్రి కొనుగోలు, ప్రయాణ వ్యయాలు, ఆకస్మిక ఖర్చులు, నిర్వహణ వ్యయాల కోసం వినియోగించుకునే వెసులుబాటు కల్పించారు.

**మార్గదర్శకాలకు ఆమోదం :** పీహెచ్.డి., అండర్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్ రీసెర్చ్ స్కాలర్‌షిప్, ఫ్యాకల్టీ రీసెర్చ్ గ్రాంట్ల అమలుకు సంబంధించిన మార్గదర్శకాలను సమావేశంలో ఖరారు చేశారు. అలాగే ఫ్యాకల్టీ రీసెర్చ్ గ్రాంట్లు, పీహెచ్.డి విద్యార్థుల ఆరు నెలల పురోగతి నివేదికలను కమిటీ పరిశీలించి ఆమోదించింది. ఈ నిర్ణయాలతో వైద్య విద్య, పరిశోధన రంగంలో నాణ్యమైన పరిశోధనలకు మరింత ఊతం లభిస్తుందని విశ్వవిద్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.

# వివిఐటియూలో "తత్వం" తొలిపాట విడుదల



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** యువ నటుడు దినేష్ తేజ్, దష్విక ప్రధాన పాత్రలలో అర్జున్ కోలా దర్శకత్వంలో రూపొందించబడిన మిస్టికల్ థ్రిల్లర్ "తత్వం". ఈ చిత్రంలోని తొలిపాట "ఊపిరంతా ఇవ్వాళే" ను వివిఐటి విశ్వవిద్యాలయంలో మ్యూజిక్ డైరెక్టర్ చేతన్ భరద్వాజ్, నిర్మాత వంశీ సీమకుర్తిలు వివిఐటి విద్యార్థులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత వంశీ మాట్లాడుతూ... ఈ చిత్రం ఆద్యంతం వినూత్నంగా ఉంటుందనీ, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని అన్నారు. ఈ చిత్రం ఖచ్చితంగా విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉందనే ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం చిత్రబృందం విద్యార్థులతో కలిసి నృత్యాలు, సెల్ఫీలతో సందడి చేశారు.

# ప్రాథమిక పాఠశాలల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలి: ఆప్టా

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను తక్షణమే భర్తీ చేసేందుకు ఈ విద్యా సంవత్సరానికి అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ప్రభుత్వం తరగతికి ఒక ఉపాధ్యాయుడు విధానంతో మోడల్ ప్రైమరీ పాఠశాలలను ప్రారంభించినప్పటికీ, పలు జిల్లాల్లో అది పూర్తిస్థాయిలో అమలు కాలేదని సంఘం పేర్కొంది. ముఖ్యంగా కర్నూలు జిల్లాలో ఇప్పటికీ అనేక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగానే కొనసాగుతున్నాయని, వర్క్ అడ్జస్ట్మెంట్ పూర్తయినప్పటికీ సిబ్బంది కొరత కొనసాగుతోందని తెలిపింది.

డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియామకానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున, అప్పటి వరకు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు కాకి ప్రకాష్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.జి. మెహది విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్‌తో పాటు పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.

# సచివాలయలలో కాళీ కుర్చీలు.. నేవ్వరపోయినా ఎమ్మార్వో!



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్)** :పట్టణం లోని గాంధినగర్‌లో ఉన్న ఒకటి,రెండు సచివాలయాలను మండల తహసిల్దార్ గోపాలకృష్ణ ఆకస్మిక తనిఖీ చేశారు. ఎమ్మార్వో గోపాల్ కృష్ణ తనిఖీ చేసే సమయానికి సచివాలయ కార్యాలయంలో ఉండాల్సిన ఉద్యోగస్తులు ఎవరు లేక పోవటం చూసి ఆశ్చర్యానికి గురైయ్యారు. ఒకటి,రెండు సచివాలయంలో ఒక్కొక్కరు చొప్పున ఉన్న ఉద్యోగులచేత సంబంధిత రిజిస్టర్లను తెప్పించుకొని అటెండెన్స్ మరియు మూమెంట్ రిజిస్టర్ను తనిఖీ చేశారు.ఎలాంటి వివరాలు లేకపోవడంతో ఉద్యోగస్తులపై చర్యలు తీసుకునేందుకు రిమార్కులు రాసి ఉన్నతాధికారులకు పంపించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో గోపాలకృష్ణ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మార్కు పట్టణంలోని ఉన్న గాంధీ నగర్ ఒకటి, రెండు సచివాలయాలను తనిఖీ చేయడం జరిగిందని ఆ సమయంలో రెండు సచివాలయాలలో ఉద్యోగస్తులు ఎవరు లేరని రికార్డులను పరిశీలించి ఉద్యోగస్తులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సమాచారాన్ని పంపించినట్లు ఆయన తెలియజేశారు.

# విభిన్న ప్రతిభావంతుల ఆత్మగౌరవ జీవనానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

- దివ్యాంగుల కలలకు రెక్కలు... ఉచిత త్రీ వీలర్ స్కూటీల పంపిణీ
- గుంటూరులో 70 మందికి త్రీ వీలర్ స్కూటీలు...రాష్ట్రవ్యాప్తంగా 1,750 వాహనాలు అందజేత
- స్వయం ఉపాధికి బాసటగా రూ.22.75 కోట్లతో త్రీ వీలర్లు పంపిణీ
- కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్







**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** విభిన్న ప్రతిభావంతులు స్వయం ఉపాధితో ఆత్మగౌరవంగా జీవించేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,750 మంది విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా త్రీ వీలర్ స్కూటీల పంపిణీ కార్యక్రమంలో భాగంగా గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన 70 మంది లబ్ధిదారులకు వాహనాలను అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పెన్షన్ల పెంపుతో పాటు వారు ఇతరులపై ఆధారపడకుండా జీవించేందుకు ఒక్కోటి రూ.1.30 లక్షల విలువైన త్రీ వీలర్ స్కూటీలను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. గుంటూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు 70 వాహనాలు, రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో మొత్తం 1,750 వాహనాలను రూ.22.75 కోట్ల వ్యయంతో పంపిణీ చేస్తున్నామని చెప్పారు. సీఎస్ఆర్ నిధుల ద్వారా వెయ్యికి పైగా విభిన్న ప్రతిభావంతులు, వృద్ధులకు వీల్‌చైర్లు, బ్యాటరీతో నడిచే త్రీ వీలర్లు, ఇతర సహాయక ఉపకరణాలు కూడా అందించినట్లు వెల్లడించారు.

గుంటూరు ఎమ్మెల్యే మహ్మద్ నశీర్ అహ్మద్ మాట్లాడుతూ, తమ నియోజకవర్గానికి చెందిన ఓ విభిన్న ప్రతిభావంతుడు పాల ప్యాకెట్లు విక్రయిస్తూ స్వయం ఉపాధితో జీవిస్తున్న తీరును తాను ఎంతోకాలంగా గమనిస్తున్నానన్నారు. అలాంటి కష్టపడే వారికి ప్రభుత్వం త్రీ వీలర్ వాహనాలను అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గుంటూరు జిల్లాలోని 70 మంది లబ్ధిదారులకు ఉపయోగం చేకూరుతుందన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ నారాయణస్వామి మాట్లాడుతూ, ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, పెరిగిన పెన్షన్లు, వివిధ రంగాల్లో అవకాశాలు కల్పించడం, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ వంటి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గల్లా మాధవి, తెనాలి శ్రావణ్ కుమార్, కన్నా లక్ష్మీనారాయణ, మహ్మద్ నశీర్ అహ్మద్, జడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టియానా, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుండ్ల కోటేశ్వరరావు, ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్, డీసీఎంఎస్ చైర్మన్ వడ్రన హరిబాబు, జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకుడు నిమ్మల శేషయ్యతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఏ కష్టమొచ్చినా నేనున్నాను

- అన్ని వ్యవస్థలు జవాబుదారీగా ఉండాలి
- ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలి
- ప్రజలతో అధికార యంత్రాంగం మర్యాదగా మెలగాలి
- ఇప్పటికే అన్ని వర్గాల సంక్షేమానికి చర్యలు
- గుంటూరు తూర్పులో మార్పునకు ముందడుగు
- ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజలు ఎలాంటి సమస్యలపై వచ్చినా తాము అందుబాటులో ఉండి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గురువారం స్థానిక తూర్పు కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను ఎమ్మెల్యే నసీర్ స్వయంగా స్వీకరించారు. నూతన పింఛన్లు, ఇళ్ల స్థలాల కేటాయింపు, మురుగు నీటి సమస్య, విద్యుత్ స్థంభాల ఏర్పాటు వంటి వాటిపై ప్రజలు అర్జీలు అందజేశారు. ఆయా సమస్యలపై వెంటనే ఎమ్మెల్యే నసీర్ సంబంధిత అధికారులతో మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే ఆయా అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. ప్రతి అర్జీదారునితో సానుకూలంగా మాట్లాడాలని సూచించారు. కార్యాలయాల చుట్టూ పదే పదే తిప్పించుకుంటే అధికార యంత్రాంగంపై నమ్మకం కోల్పోతారని, అప్పుడే పీజీఆర్ఎస్ కు వెళతారని చెప్పారు. అలాంటి పరిస్థితులు రాకుండా కార్యాలయాలకు వచ్చిన వారితో మర్యాదగా మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఇది ప్రజా ప్రభుత్వమని, ప్రజల కోసం పని చేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో కూటమి రెండేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేశామని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లామని చెప్పారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఇళ్ల రెగ్యులరైజేషన్ ప్రక్రియను చేపట్టామని తెలిపారు. త్వరలో నూతన పింఛన్లను రాష్ట్ర ప్రభుత్వం అందించబోతోందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇప్పటికే స్పౌజ్ కేటగిరీ కింద భార్యాభర్తల్లో ఒకరు మరణిస్తే వెంటనే భాగస్వామికి అందించామన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అంచెలంచెల వ్యవస్థను తీసుకొచ్చిందని, మండల, జిల్లా స్థాయిలోనూ పీజీఆర్ఎస్ నిర్వహిస్తోందని తెలిపారు. ప్రజలకు సంతృప్తికరస్థాయిలో అధికారులు సేవలందించాలని సూచించారు.

# వేమూరులో నేడు 'మీకోసం' ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం




**వేమూరు(జర్నలిస్ట్ ఫైల్) :** వేమూరు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నేడు ఉదయం 10 గంటలకు నిర్వహించే 'మీకోసం' ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొననున్నారు.

ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి, వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం, వారి సమస్యలకు వేగవంతమైన పరిష్కారం అందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

వేమూరు మండలానికి చెందిన కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.


# ఎయిమ్స్‌లో కొవిడ్ కలకలం.. అప్రమత్తమైన వైద్య విభాగం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మంగళగిరిలోని ప్రతిష్టాత్మక అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) ఆసుపత్రిలో కరోనా కలకలం రేగింది. నిన్న కొవిడ్ అనుమానిత లక్షణాలతో ఆసుపత్రికి వచ్చిన ఒక వ్యక్తికి వైద్యులు ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం సదరు బాధితుడిని హోం ఐసోలేషన్‌లో ఉండాలని సూచిస్తూ ఇంటికి పంపించారు. ఇటీవల కాలంలో జ్వరాల బారిన పడుతున్న బాధితుల సంఖ్య క్రమంగా పెరుగుతుండటం, అలాగే కొవిడ్ లక్షణాలు కనిపిస్తుండటంతో ఎయిమ్స్ వైద్యులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. కరోనా కేసుల నమోదు నేపథ్యంలో ఎయిమ్స్ ఆసుపత్రిలో ప్రత్యేకంగా 'ఫీవర్ వార్డు'ను ఏర్పాటు చేశారు. వైరస్ వ్యాప్తి చెందకుండా ఉండేందుకు, జ్వరంతో వచ్చే రోగులకు ఇక్కడే ప్రత్యేక వైద్య సేవలు అందించేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. మరోవైపు ఎయిమ్స్‌లో కొవిడ్ కలకలం రేగడంతో గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి వైద్యులు సైతం అప్రమత్తమయ్యారు. జీజీహెచ్ అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన ఆర్టీపీసీఆర్ టెస్టింగ్ కిట్లను సిద్ధంగా ఉంచారు. ప్రజలు అనవసరంగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే జ్వరం, దగ్గు, శ్వాసకోస సమస్యలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని, మాస్కులు ధరించడం వంటి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారులు విజ్ఞప్తి చేశారు.

# ఎన్టీఆర్ చేనేత భరోసా చేనేత కుటుంబాలకు వరం

- చేనేత కార్మికులకు రూ.25 వేల ఆర్థిక సాయం
- ఆగస్టు 7న ఎన్టీఆర్ చేనేత భరోసా పథకం ప్రారంభం
- 55 వేల చేనేత కుటుంబాలకు ఆర్థిక భరోసా
- హామీలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి స్థానిక శాసనసభ్యులు నారా లోకేష్‌ను అభినందించిన ధనుంజయరావు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న "ఎన్టీఆర్ చేనేత భరోసా" పథకం చేనేత కుటుంబాలకు గొప్ప వరంగా నిలవనుందని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయరావు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో చేనేత కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రతి అర్హత కలిగిన చేనేత కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించడం హర్షణీయమన్నారు. జాతీయ చేనేత దినోత్సవమైన ఆగస్టు 7న ఈ పథకాన్ని ప్రారంభించడం చేనేత కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని ఆయన తెలిపారు. రాష్ట్రంలోని సుమారు 55 వేల చేనేత కుటుంబాలకు ఈ పథకం ద్వారా ఆర్థిక భరోసా కల్పించనున్నట్లు చెప్పారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, చేనేత శాఖ మంత్రి సవిత ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం అభినందనీయమని ధనుంజయరావు పేర్కొన్నారు. రాష్ట్ర చేనేత కార్మికుల తరఫున వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన సంక్షేమ పథకాలు, పెండింగ్ బకాయిలను కూటమి ప్రభుత్వం దశలవారీగా పరిష్కరిస్తూ చేనేత రంగానికి కొత్త ఊపిరి పోస్తోందని ఆయన అన్నారు. చేనేత ఉపవృత్తులపై ఆధారపడిన మరో 10 వేల మంది కార్మికులకు కూడా ప్రత్యేక ఆర్థిక సాయం అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం సంతోషకరమైన పరిణామమని పేర్కొన్నారు. చేనేత కార్మికులకు అండగా ఉంటామని ఇచ్చిన హామీలను ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేస్తోందని, చేనేత పరిశ్రమ అభివృద్ధి కోసం తీసుకుంటున్న నిర్ణయాలు చేనేత కుటుంబాల్లో కొత్త ఆశలు నింపుతున్నాయని గుత్తికొండ ధనుంజయరావు తెలిపారు.

# మాది ఇన్వెస్టర్ల ఫ్రెండీ ప్రభుత్వం: మంత్రి సవిత



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** భారత్ టెక్స్ - 2026 ఈవెంట్ లో పాల్గొనడానికి ఢిల్లీ వెళ్లిన రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత మొదటి రోజు బిజీగా గడిపారు. పలువురు జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులు, కొనుగోలుదారులతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడుల రాకకు, పరిశ్రమల స్థాపనకు తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందని, ఇన్వెస్టర్లకు ఫ్రెండీ ప్రభుత్వమని తెలిపారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా ఉంటామంటూ, ఏపీలో పెట్టుబడులు పెట్టాలని మంత్రి సవిత కోరారు. ఈ సందర్భంగా చేనేత వస్త్రాల కొనుగోలుకు సంబంధించి పలు ఆర్డర్లు సైతం చేనేత, జౌళి శాఖకు వచ్చాయి. ఈ నెల 14 నుంచి కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అతిపెద్ద అంతర్జాతీయ టెక్స్‌టైల్ ప్రదర్శన భారత్ టెక్స్ -2026 ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ టెక్స్ ఈవెంట్లో రాష్ట్రానికి చెందిన టెక్స్ టైల్స్ ఉత్పత్తుల అమ్మకాలే లక్ష్యంగా మంత్రి సవిత రెండ్రోజుల పర్యటనకు గురువారం ఢిల్లీ చేరుకున్నారు. మొదటి రోజు పలువురు జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులు, కొనుగోలుదారులతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో ప్రపంచ ప్రఖ్యాత గాంచిన వివిధ ప్రాంతాల చేనేత వస్త్రాల ప్రాముఖ్యత తో పాటు ఆయా వస్త్రాల తయారీలో కలంకారీ నైపుణ్యం వినియోగంపైనా వారికి వివరించారు. ముఖ్యంగా రాష్ట్రంలో పెట్టుబడుల స్థాపనకు సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత వివరించారు. దేశంలోకి వస్తున్న పెట్టుబడుల్లో 25 శాతానికి పైగా ఏపీకే తరలొస్తున్నాయన్నారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసం నెలకొల్పేలా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ అండగా ఉంటున్నారన్నారు. తమది ఇన్వెస్టర్లకు ఫ్రెండ్లీ ప్రభుత్వమని మంత్రి సవిత స్పష్టంచేశారు.

**చేనేత ఉత్పత్తుల కొనుగోలు ఆసక్తి :** భారత్ టెక్స్ 2026లో ఏర్పాటు చేసిన ఏపీ పెవిలియన్ కు విశేష స్పందన లభిస్తోంది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన చేనేత ఉత్పత్తుల కొనుగోలుకు పలువురు జాతీయ, అంతర్జాతీయ కొనుగోలుదారులు ఆసక్తి చూపారు. ముఖ్యంగా చేనేత వస్త్రాలపై కలంకారీ చీరలు, ఇతర ఉత్పత్తులు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

**మంత్రి సవిత వరుస భేటీలు:** భారతదేశ అతిపెద్ద అంతర్జాతీయ టెక్స్‌టైల్ ప్రదర్శనకు విచ్చేసిన మంత్రి సవిత పలువురు పెట్టుబడిదారులు, కొనుగోలు దారులతో భేటీ అయ్యారు. అరవింద్ ఫ్యాబ్రిక్ సీఈవో డాక్టర్ పరమ్ షా, భారత్ టెక్స్ 2026 ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ నరేన్ గోయెంకాతో పలు అంశాలపై చర్చించారు. వారితో పలువురు విదేశీ కొను గోలుదారులతోనూ చర్చలు జరిపారు. రెండోరోజు శుక్రవారం కూడా మంత్రి సవిత భారత్ టెక్స్ ఈవెంట్ లో పాల్గొనబోతున్నారు. సాయంత్రం ఢిల్లీలో ఆధునీకరించిన లేపాక్షి షో రూమ్ ను మంత్రి సవిత ప్రారంభించనున్నారు. అంతకు ముందు ఢిల్లీ పర్యటనకు వచ్చిన మంత్రి సవితకు కేంద్ర హ్యాండ్లూమ్ ఎక్స్ పోర్ట్ ప్రోమోషనల్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్.శ్రీధర్, ఏపీహెచ్డీసీ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరి ప్రసాదరావు, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, ఇతర అధికారులు ఘన స్వాగత పలికారు.

# 24 సవరించిన సర్ షెడ్యూల్!

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల సంఘం ఓటరు జాబితాలను మరింత ఖచ్చితంగా, పారదర్శకంగా రూపొందించేందుకు SIR ప్రక్రియను ఈనెల 24వ తేదీ వరకు పొడిగించినట్లు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ రమణి తెలిపారు. ఈ ప్రక్రియలో ఓటర్ల వివరాలను పరిశీలించి, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, మరణించిన లేదా అనర్హులైన వారి పేర్ల తొలగింపు వంటి చర్యలు చేపడతారు. అర్హులైన ప్రతి పౌరుడు తన పేరు ఓటరు జాబితాలో సరిగా ఉందో లేదో పరిశీలించి, అవసరమైతే సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. SIR పూర్తయిన తర్వాత తుది ఓటరు జాబితాను విడుదల చేస్తారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# రాష్ట్రంలో 12 కొవిడ్ కేసులు...



- ఆందోళన అవసరం లేదన్న ఆరోగ్యశాఖ
- నాలుగు జిల్లాల్లో చెదురుమదురుగా నమోదు
- పూణే ల్యాబ్‌కు జన్యుక్రమ విశ్లేషణ కోసం ఐదు నమూనాలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో కొవిడ్-19 కేసులు చెదురుముదురుగా నమోదవుతున్నాయని వైద్య, ఆరోగ్యశాఖ వెల్లడించింది. జూన్ 26 నుంచి జులై 16 వరకు మొత్తం 12 కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదయ్యాయని, వీటిలో నలుగురు మృతి చెందినట్లు వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి. వీర పాండియన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే మృతి చెందిన వారందరికీ ఇప్పటికే అధిక రక్తపోటు, మధుమేహం, మూత్రపిండాల వ్యాధులు తదితర తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు.

ఈ ఏడాది రాష్ట్రంలో తొలి కొవిడ్ కేసు జూన్ 26న కడప జిల్లాలో నమోదైంది. జులై 1 నుంచి 16 వరకు మరో 11 కేసులు వెలుగుచూశాయి. వీరిలో ఇద్దరు ఇప్పటికే కొవిడ్ సోకిన వ్యక్తులతో సన్నిహితంగా మెలిగిన వారిగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. నమోదైన కేసులన్నీ వేర్వేరు మండలాలు, ప్రాంతాల్లో నమోదయ్యాయని, ఒకే ప్రాంతంలో క్లస్టర్‌గా కేసులు బయటపడలేదని వీర పాండియన్ స్పష్టం చేశారు. మొత్తం కేసుల్లో కడప జిల్లాలో అత్యధికంగా ఎనిమిది నమోదుకాగా, గుంటూరు జిల్లాలో రెండు, విశాఖపట్నం, కాకినాడ జిల్లాల్లో ఒక్కో కేసు చొప్పున నమోదయ్యాయి.

**67 మందికి కొవిడ్ పరీక్షలు :** జూన్ 26 నుంచి జులై 15 వరకు రాష్ట్రంలో 67 మందికి కొవిడ్ పరీక్షలు నిర్వహించగా, 11 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. కాకినాడ జిల్లాకు చెందిన మరో వ్యక్తికి తమిళనాడులోని వేలూరు సీఎంసీ ఆసుపత్రిలో నిర్వహించిన పరీక్షలో వైరస్ నిర్ధారణ కావడంతో రాష్ట్రంలో మొత్తం కేసుల సంఖ్య 12కు చేరింది.

**4 మరణాలు :** కొవిడ్ పాజిటివ్‌గా తేలిన వారిలో కడప జిల్లాకు చెందిన ముగ్గురు, కాకినాడ జిల్లాకు చెందిన ఒకరు మృతి చెందారు. వీరందరికీ ముందునుంచే తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్నాయని ఆరోగ్యశాఖ వెల్లడించింది. వైరస్ జన్యు స్వరూపాన్ని గుర్తించేందుకు ఐదు నమూనాలను జులై 9న పూణేలోని జాతీయ వైరాలజీ సంస్థ (ఎన్ఐవీ)కు జన్యుక్రమ విశ్లేషణ కోసం పంపించినట్లు తెలిపింది.

ప్రస్తుతం ముగ్గురు స్వీయ గృహ నిర్బంధంలో ఉండగా, ఇద్దరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మరో ముగ్గురు కోలుకుని డిశ్చార్జి అయ్యారు. ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, సాధారణ జాగ్రత్తలు పాటించాలని, వైద్యులు, ఆసుపత్రులు, ఆరోగ్య సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు వీర పాండియన్ తెలిపారు.

**దేశంలో 339 కేసులు.. కేరళలో అత్యధికం :** దేశవ్యాప్తంగా జులై 1 నుంచి ఇప్పటివరకు 339 కొవిడ్ కేసులు నమోదయ్యాయి. వీటిలో కేరళలో అత్యధికంగా 115 కేసులు నమోదుకాగా, కర్ణాటకలో 64, మహారాష్ట్రలో 43, తమిళనాడులో 39, అండమాన్‌లో 18, ఢిల్లీలో 18, రాజస్థాన్‌లో 12 కేసులు నమోదయ్యాయి. ఇతర రాష్ట్రాల్లో కూడా స్వల్ప సంఖ్యలో కేసులు వెలుగుచూశాయని కేంద్ర ఆరోగ్యశాఖ గణాంకాలు

# భవిష్యత్ ఇంజినీర్లకు ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఘన స్వాగతం

- "ఆరంభ్-2026"తో నూతన విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపిన 'ఎన్ఆర్ఐఐటీ' పాలిటెక్నిక్








**విశాదల(జర్నలిస్ట్ ఫైల్) :** సాంకేతిక విద్యతో పాటు విలువలు, నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలకు సమాన ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థులను ఉన్నత భవిష్యత్తు వైపు నడిపిస్తున్న ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఆర్ఐఐటీ) పాలిటెక్నిక్‌లో నూతన విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు. పాలిటెక్నిక్‌లో కొత్తగా చేరిన విద్యార్థుల కోసం నిర్వహించిన "ఆరంభ్--2026" ఇండక్షన్ కార్యక్రమం గురువారం కళాశాల ప్రాంగణంలో ఉత్సాహభరిత వాతావరణంలో అట్టహాసంగా జరిగింది. విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఎన్ఆర్ఐ ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ డా. రవీంద్ర అలపాటి (ఎం.డి., యూఎస్ఏ) ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే స్పష్టమైన లక్ష్యాలు, క్రమశిక్షణ, అంకితభావం తప్పనిసరిగా ఉండాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో నిరంతరం కొత్త విషయాలు నేర్చుకుంటూ తమ ప్రతిభను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రెస్ అకాడమీ ఛైర్మన్ అలపాటి సురేష్ మాట్లాడుతూ, సాంకేతిక విద్యతో పాటు కమ్యూనికేషన్, నాయకత్వం, వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు కూడా సమానంగా అవసరమని చెప్పారు. సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుత పౌరులుగా విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ, పాలిటెక్నిక్ విద్య నేటి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అపారమైన ఉపాధి అవకాశాలను కల్పిస్తోందని పేర్కొన్నారు. కళాశాల అందించే ఆధునిక సౌకర్యాలు, శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు.

ఎన్ఆర్ఐ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి, కరస్పాండెంట్ అలపాటి రాజేంద్ర ప్రసాద్ (ఎంఎల్‌సీ) మాట్లాడుతూ, నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు విలువలతో కూడిన విద్యను అందించడం సంస్థ ధ్యేయమని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేలా అత్యాధునిక బోధన, ప్రాక్టికల్ శిక్షణ, కెరీర్ మార్గదర్శక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు వివరించారు.

ప్రత్యేక అతిథులుగా పాల్గొన్న చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కుర్రా శరత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్ బాబు కళాశాలలో అందుబాటులో ఉన్న విద్యా, సాంకేతిక, ప్లేస్‌మెంట్ అవకాశాలను వివరించారు. విద్యార్థులు తమ ప్రతిభను వెలికితీసి పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించు కోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐఐటీ ప్రిన్సిపాల్ డా. డోలా సంజయ్ ఎస్., ఎన్ఆర్ఐఐటీ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రవి కుమార్ పి. నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ కళాశాల విద్యా విధానం, నియమ నిబంధనలు, శిక్షణా కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి, ప్లేస్‌మెంట్ ప్రణాళికలు, సమగ్ర వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలను వివరించారు.

కార్యక్రమంలో గత విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అకాడమిక్ టాపర్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. వారి విజయాలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని అతిథులు పేర్కొన్నారు. అనంతరం ముఖ్య అతిథులను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది.

ఈ కార్యక్రమంలో శాఖాధిపతులు, పరిపాలనాధికారి సీతారామయ్య, పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, లక్ష్యసాధనపై స్పష్టమైన దిశానిర్దేశం కల్పించిన "ఆరంభ్-2026" కార్యక్రమం ఎన్ఆర్ఐఐటీ విద్యా ప్రమాణాలు, విద్యార్థుల భవిష్యత్తుపై సంస్థ నిబద్ధతకు మరో నిదర్శనంగా నిలిచింది.

# చెప్పిన తేదీ ప్రకారమే శంకర్ విలాస్ ఆర్ఓబీ ప్రారంభం

- పనుల్లో జాప్యానికి తావులేదు.. చిన్నచిన్న సమస్యలన్నీ పరిష్కరిస్తున్నాం
- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్






**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు నగరంలో నిర్మాణంలో ఉన్న శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) పనులు ముందుగా ప్రకటించిన గడువులోనే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే గల్లా మాధవితో కలిసి గురువారం ఆయన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించి పనుల పురోగతిని తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ, వంతెన నిర్మాణంలో ఎదురవుతున్న చిన్నచిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ పనులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం రెండు, మూడు పిల్లర్లకు సంబంధించిన పనులు మినహా మిగిలిన నిర్మాణం సంతృప్తికరంగా సాగుతోందన్నారు. మరికొన్ని గర్డర్లు వచ్చిన వెంటనే పనులు మరింత వేగం పుంజుకుంటాయని, అవసరమైతే కార్మికుల సంఖ్యను కూడా పెంచుతామని వెల్లడించారు. వచ్చే ఏడాదిలో అన్ని పనులు పూర్తిచేసి శంకర్ విలాస్ ఆర్ఓబీని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు.

గుంటూరు జిల్లాకు ఒకేసారి అనేక ఆర్ఓబీలు మంజూరు కావడం అదృష్టమని పెమ్మసాని అన్నారు. ఇటువంటి మౌలిక సదుపాయాల నిర్మాణానికి ప్రజల సహకారం ఎంతో అవసరమని చెప్పారు. శ్యామలనగర్ వద్ద కొందరు ఆర్ఓబీకి బదులుగా అండర్‌పాస్ (ఆర్‌యూబీ) నిర్మించాలని కోరుతున్నారని, అయితే అందరి అంగీకారంతోనే ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్నామని తెలిపారు. భూసేకరణకు అవసరమైన సహకారం లభించిన వెంటనే నోటిఫికేషన్ జారీ చేస్తామని వెల్లడించారు. ప్రాజెక్టు కోసం అవసరానికి మించిన పరిహారం అందిస్తున్నామని కూడా చెప్పారు.

ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ, శంకర్ విలాస్ ఆర్ఓబీని ముందుగా ప్రకటించిన గడువులోనే పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నిర్మాణ సామగ్రి సహా ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరిస్తూ పనులు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని తెలిపారు. మొత్తం నిర్మాణ ప్రక్రియ శరవేగంగా సాగుతోందని, వంతెన పనులపై ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా ప్రజలు వదంతులను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

పరిశీలన కార్యక్రమంలో లిప్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యాలరావు, ఇండస్ట్రియల్ కార్పొరేషన్ ఛైర్మన్ దేగల ప్రభాకర్, వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ మల్లెల ఈశ్వర్, డీసీఎంఎస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు, మున్సిపల్ కమిషనర్ మయూర్ అశోక్, ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, రైల్వే సీనియర్ డివిజనల్ ఇంజనీర్ (కోఆర్డినేషన్) శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మూడు పోర్టుల అభివృద్ధికి భూసేకరణ.. ఉత్తర్వులు జారీ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు మూడు పోర్టు(్రాశీతీం)లకు భూమిని సేకరించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. మూలపేట, మచిలీపట్నం, రామాయపట్నం పోర్టులకు మళ్లీ భూసేకరణ(్ఖఅస ూాఏనబఱఅంఱఅశీఅ) చేపట్టాలని నిర్ణయించింది. రెండో దశలో 6,248.54 ఎకరాల భూమి సేకరణకు కసరత్తులు ప్రారంభించింది. రూ.1,638.52 కోట్లతో భూసేకరణ చేపట్టేందుకు పరిపాలనా అనుమతులకు సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టుకు 1,903.39 ఎకరాలు, మచిలీపట్నం పోర్టుకు 1,420.70 ఎకరాలు, రామాయపట్నం పోర్టుకు 2,924.45 ఎకరాల భూమిని సేకరించేందుకు సిద్ధమైంది.

# ఏఈఈ నియామక షెడ్యూలులో ఎలాంటి మార్పు లేదు

- సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మొద్దు..
- ఉద్యోగాల పేరుతో డబ్బులు అడిగితే అప్రమత్తంగా ఉండాలి: సీఎండీ పుల్లారెడ్డి



**విజయవాడఅమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీసీపీడీసీఎల్) ఆధ్వర్యంలో చేపడుతున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) నియామక ప్రక్రియ షెడ్యూలులో ఎలాంటి మార్పు లేదని సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పి. పుల్లారెడ్డి స్పష్టం చేశారు. ఏఈఈ పోస్టులకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ జూన్ 30 ఉదయం 10 గంటలకు ప్రారంభమై, జూలై 20 రాత్రి 11.59 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. ఇదే అధికారిక షెడ్యూలు అమల్లో ఉందని, నియామకాలకు సంబంధించిన అధికారిక ప్రకటనలు ఏపీసీపీడీసీఎల్ అధికారిక వెబ్‌సైట్, అధికారిక సమాచార మాధ్యమాల ద్వారానే విడుదలవుతాయని పేర్కొన్నారు.

ఏఈఈ నియామకాలపై సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపులు, యూట్యూబ్ ఛానళ్లలో వస్తున్న అసత్య ప్రచారాలను అభ్యర్థులు విశ్వసించవద్దని పుల్లారెడ్డి సూచించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని, నియామకాల్లో సహాయం చేస్తామని చెప్పి డబ్బులు డిమాండ్ చేసే దళారులు, మధ్యవర్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా, ప్రతిభ ఆధారంగానే నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఏవైనా సందేహాలు ఉంటే అధికారిక వెబ్‌సైట్ లేదా సంబంధిత అధికారులను మాత్రమే సంప్రదించాలని అభ్యర్థులకు సూచించారు.

# పోలవరానికి ప్రధాని మోదీ అండదండలు

- ప్రాజెక్టు పూర్తయ్యే వరకు నిధుల కొరత లేదు
- రాయలసీమకు శాశ్వత నీటి భద్రత
- ఉత్తరాంధ్రకు తాగునీటి వరం
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్









**పోలవరం (జర్నలిస్ట్ ఫైల్) :** పోలవరం జాతీయ ప్రాజెక్టు పూర్తయ్యే వరకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. రాష్ట్ర భవిష్యత్తును మలిచే ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధుల విషయంలో ఎలాంటి వెనుకంజ ఉండదని తెలిపారు. బీజేపీ నాయకులతో కలిసి గురువారం పోలవరం ప్రాజెక్టును సందర్శించిన మంత్రి ప్రధాన డ్యాం, కొత్త డయాఫ్రం వాల్, కాఫర్‌డ్యాం, ఎడమ కాలువ, టన్నెల్లు, జలవిద్యుత్ కేంద్ర నిర్మాణ పనులను పరిశీలించారు. జలవనరుల శాఖ అధికారులతో నిర్మాణ పురోగతిని సమీక్షించి, మిగిలిన పనులపై ఆరా తీశారు.

**జాతీయ ప్రాజెక్టుగా బీజేపీ కృషి:** అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి... 1941లోనే పోలవరం ఆలోచన వచ్చినప్పటికీ దశాబ్దాలపాటు నిర్మాణం ముందుకు సాగలేదన్నారు. రాష్ట్ర విభజన సమయంలో బీజేపీ సీనియర్ నాయకులు ఎం. వెంకయ్యనాయుడు, ఎల్.కే. అద్వానీ, అరుణ్ జైట్లీ, సుష్మా స్వరాజ్ చేసిన కృషి వల్లే ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పోలవరానికి జాతీయ ప్రాజెక్టు హోదా దక్కిందని గుర్తు చేశారు.

**ప్రధాని మోదీతో పూర్తి ఆర్థిక భరోసా :** ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత పోలవరం నిర్మాణానికి ఇప్పటివరకు రూ.20,750 కోట్లకు పైగా విడుదల చేశారని తెలిపారు. గతంలో కేంద్ర--రాష్ట్ర భాగస్వామ్యంతో కొనసాగిన నిధుల విధానాన్ని మార్చి, ప్రాజెక్టు పూర్తి వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వమే భరిస్తోందన్నారు. దీంతో నిర్మాణానికి ఆర్థిక ఇబ్బందులు లేకుండా పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. గత 12 ఏళ్లలో ప్రాజెక్టు పనులు సుమారు 90 శాతం పూర్తయ్యాయని వివరించారు.

**మళ్లీ పుంజుకున్న నిర్మాణం :** 2014 నుంచి 2019 వరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని తొలి ఎన్డీయే ప్రభుత్వంలో పోలవరం పనులు వేగంగా సాగాయని, 2019--24 మధ్య ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించడంతో నిర్మాణం తిరిగి వేగం అందుకుందని పేర్కొన్నారు.

**రాయలసీమకు జీవనాడి :** పోలవరం పూర్తయితే గోదావరి జిల్లాలకే పరిమితం కాకుండా ఉత్తరాంధ్రకు తాగునీరు, పరిశ్రమలకు అవసరమైన నీరు అందుతుందని మంత్రి తెలిపారు. గోదావరి నుంచి 80 టీఎంసీల నీటిని కృష్ణా పరీవాహక ప్రాంతానికి మళ్లించడం ద్వారా శ్రీశైలం జలాశయంలో నీటి లభ్యత పెరిగి, కరవుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రాయలసీమకు శాశ్వత నీటి భద్రత లభిస్తుందని వివరించారు.

**పర్యాటకంగా తీర్చిదిద్దుతాం :** పోలవరం నిర్మాణంతో పాటు ప్రాజెక్టు పరిసరాలను ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రత్యేక నిధులను కేంద్ర ప్రభుత్వం, బీజేపీ జాతీయ నాయకత్వం దృష్టికి తీసుకెళ్తామని మంత్రి తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి పోలవరం కీలక ప్రాజెక్టుగా నిలుస్తుందని, కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో త్వరలోనే పూర్తిచేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467